## విలేఖరులు కావలెను

ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ రాష్ట్రాల వ్యాప్తంగా " శ్రీ ప్రస్థానం దినపత్రికలో " పనిచేయుటకు జిల్లా స్టాఫర్లు, సిసి ఇంచార్జులు, మండల స్థాయి పాత్రికేయులు కావలెను. సమాజంలో జరిగే ప్రతి విషయాన్ని ప్రజల ముంగిటకు తీసుకెళ్లాలనే ఆసక్తి, అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఉంటుంది.

పెరుమాళ్ళ వర ప్రసాద్

సంప్రదించవలసిన నంబర్లు

94916 28386    85220 22029

Land Line No : 08517 224194



RNI Rgd NO : 2020/80757

www.sreeprasthanam.in

# శ్రీ ప్రస్థానం

మన దేశం..మన హక్కు

తెలుగు దినపత్రిక



తెలంగాణ - శ్రీ ప్రస్థానం



Call : 8522022029, 9491628386



కర్నూలు సంపుటి : 04 సంచిక : 06 గురువారం 18-04-2024 పేజీలు :04 వెల:రూ.2.00


# నేడు నాలుగోదశ ఎన్నికలకు నోటిఫికేషన్



### నేటి నుంచే నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం
### ఉభయ తెలుగు రాష్ట్రాల్లోనూ నోటిఫికేషన్
### 18 నుంచి 25 వరకు నామినేషన్ల స్వీకరణ
### 26న నామినేషన్ల పరిశీలన..29న ఉపసంహరణ
### మే 13న నాలుగోదశలో పోలింగ్ నిర్వహణ

న్యూఢిల్లీ/ హైదరాబాద్,ఏప్రిల్17: దేశ వ్యాప్తంగా సార్వత్రిక ఎన్నికలకు సమయం ఆసన్నమైంది. మొత్తం 7 దశలలో దేశంలోని అన్ని లోక్‌సభ స్థానాలకు కేంద్ర ఎన్నికల సంఘం పోలింగ్ నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తోంది. మార్చి 16న సీఈసీ రాజీవ్ కుమార్ సార్వత్రిక ఎన్నికలు 2024 షెడ్యూల్ విడుదల చేయగా.. దేశ వ్యాప్తంగా ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. ప్రజాస్వామ్యబద్ధంగా, శాంతియుతంగా ఎన్నికలు నిర్వహించేందుకు అన్ని విధాలుగా ఈసీ ఏర్పాట్లు చేస్తోంది. ఏప్రిల్ 19న తొలి దశ పోలింగ్ జరగనుంది. లోక్‌సభ ఎన్నికలకుగానూ ఇదివరకే మూడు దశల ఎన్నికల నోటిఫికేషన్లు ఇసి విడుదల చేసింది. 18న నాలుగో దశ ఎన్నికల నోటిఫికేషన్ విడుదలకు ఇసి ఏర్పాట్లు చేస్తోంది. నాల్గవ దశలో 10 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలలో 96 లోక్ సభ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. ఆంధ్రప్రదేశ్ (25 స్థానాలు), తెలంగాణ (17), బిహార్ (5), ఝార్ఖండ్ (4), మధ్యప్రదేశ్ (8), మహారాష్ట్ర (11), ఒడిశా (4), ఉత్తర్ ప్రదేశ్ (13), పశ్చిమ బెంగాల్ (8), జమ్మూకాశ్మీర్ (1). గురువారం ఆంధప్రదేశ్, తెలంగాణలో ఎన్నికలకు ఎన్నికల నోటిఫికేషన్ జారీ కానుంది. అదే రోజు నుంచి అంటే 18 నుంచే అభ్యర్థుల నుంచి నామినేషన్లు స్వీకరిస్తారు. ఏప్రిల్ 25 వరకూ నామినేషన్లు దాఖలుకు గడువు ఇచ్చారు. ఈ 26న నామినేషన్ల పరిశీలన చేపడతారు. చివరికి ఈ నెల 29న నామినేషన్ల ఉప సంహరణతో ఈ పక్రియ పూర్తి అవుతుంది. నాలుగో దశలో ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణలలో మే 13న ఎన్నికలు జరగనున్నాయి. ఏపీలో అసెంబ్లీ ఎన్నికలతో పాటు లోక్ సభ స్థానాలకు, తెలంగాణలో లోక్‌సభ ఎన్నికలతో పాటు ఖాళీ అయిన సికింద్రాబాద్ కంటోన్మెంట్ స్థానానికి ఇదే దశలో పోలింగ్ నిర్వహించనున్నారు. జూన్ 4 న ఓట్లు లెక్కించి, విజేతల్ని ఇసి ప్రకటించనుంది. ఈ క్రమంలో గురువారం ఏపీ, తెలంగాణ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కానుంది. అదేరోజు నామినేషన్ల పక్రియ ప్రారంభం కానుంది. నామినేషన్లు దాఖలుకు తుది గడువు - ఏప్రిల్ 25. ÷ామినేషన్ల పరిశీలన - ఏప్రిల్ 26, నామినేషన్ల ఉప సంహరణ - ఏప్రిల్ 29, ఎపీ, తెలంగాణలో ఎన్నికలు - మే 13న నిర్వహిస్తారు. తొలిదశలో ఏప్రిల్ 19న 21 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలో ఎన్నికలు జరుగుతాయి. మొత్తం 102 లోక్ సభ స్థానాలకు పోలింగ్ జరుగనుంది. 2వ దశ ఎన్నికలు- ఏప్రిల్ 26న నిర్వహించనున్నారు. అభ్యర్థుల నామినేషన్ల గడువు ఏప్రిల్ 4తో ముగిసింది. రెండవ దశలో 12 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల నుంచి 89 స్థానాల్లో ఎన్నికలు జరుగుతాయి. ఫేజ్ 3 ఎన్నికలు- మే 7న పోలింగ్.. కాగా, అభ్యర్థుల నామినేషన్ల గడువు ఏప్రిల్ 19తో ముగియనుంది. మూడో దశలో భాగంగా 12 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి 94 లోక్ సభ స్థానాలకు పోలింగ్ జరుగనుంది. 4వ దశ ఎన్నికలు- మే 13న ఓటింగ్ జరగనుండగా.. అభ్యర్థుల నామినేషన్ల తుది గడువు ఏప్రిల్ 25తో ముగియనుంది. నాల్గవ దశలో 10 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలలో 96 లోక్ సభ స్థానాలకు ఎన్నికలు జరుగనున్నాయి. 5వ దశ ఎన్నికలు- మే 20న పోలింగ్ నిర్వహించనుంది. మే 3 వరకు అభ్యర్థుల నుంచి నామినేషన్లు స్వీకరిస్తారు. ఐదవ దశలో 8 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల నుంచి 49 లోక్‌సభ స్థానాలకు పోలింగ్6వ దశ ఎన్నికలు- మే 25న ఎన్నికలు ఉండగా.. మే 6తో అభ్యర్థుల నామినేషన్ల గడువు ముగియనుంది. ఆరవ దశలో 7 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల నుంచి 57 లోక్ సభ స్థానాలకు ఎన్నికలు ఉంటాయి. 7వ దశ ఎన్నికలు- జూన్ 1న పోలింగ్ జరగాల్సి ఉండగా.. అభ్యర్థుల నామినేషన్ల గడువు మే 14తో ముగియనుంది. ఏడవ దశలో 8 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల నుంచి 57 లోక్ సభ స్థానాలకు పోలింగ్ జరుగుతుంది. జూన్ నాలుగున కౌటింగ్ చేపట్టి ఫలితాలు ప్రకటిస్తారు.

# కన్నుల పండువగా శ్రీ సీతారాముల కళ్యాణం..

### భద్రాద్రి రామయ్య సేవలో తెలంగాణ మంత్రులు..



దక్షిణ అయోధ్యగా పిలిచే భద్రాచలంలో.. సీతారాముల కళ్యాణం కన్నులపండువగా జరిగింది. ముత్యాలు, పగడాలు, వచ్చలహారంతో.. సీతారాములు మెరిసిపోయారు. మిథిలా స్టేడియంలో వేలాదిమంది భక్తుల నడుమ రాములోరి కళ్యాణం వైభవంగా సాగింది. వేదమంత్రోచ్ఛరణలు, రామనామ స్మరణతో మిథిలా స్టేడియం మార్మోగిపోయింది. ముందుగా.. సీతా సమేతంగా రాముల వారిని ప్రత్యేక పల్లకీలో ఆలయ ప్రధాన ద్వారం నుంచి పల్లకిపై మేళ తాళాలతో కళ్యాణ మండపంలోకి తీసుకొచ్చారు. ఆ తర్వాత.. కళ్యాణ క్రతువు పూర్తి చేసి.. అభిజిత్ లగ్నంలో సీతమ్మపై జీలకర్ర బెల్లం పెట్టించారు పూజారులు. ఆ వెంటనే.. సీతమ్మకు.. రామదాసు చేయించిన తాళిబొట్టును భక్తులందరికీ చూపించారు. రాములోరి చేతి దగ్గర ఉంచి మాంగళ్యధారణ చేయించారు. ఏడాదికోసారి జరిగే అద్భుతఘట్టం ఇది. రాములోరి కళ్యాణం చూసి భక్తులంతా పులకించిపోయారు. కొలిచిన వారి కొంగుబంగారంగా ప్రతీతి ఉన్న భద్రాద్రి రామయ్య కళ్యాణంలో పాల్గొన్న భక్తులు రామనామాన్ని స్మరించారు. కళ్యాణ వేదిక ప్రాంగణమంతా భక్తుల జయజయ నినాదాలతో, గోవింద నామస్మరణతో మార్మోగిపోయింది. సాధారణంగా భద్రాచలం రామయ్యకు ప్రతి ఏటా శ్రీరామ నవమికి ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలు సమర్పించడం ఆనవాయితీ. ముఖ్యమంత్రి ఈ కార్యక్రమంలో పాల్గొంటారు. అయితే ప్రస్తుతం తెలంగాణలో లోక్ సభ ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో ఎన్నికల కోడ్ కారణంగా ఈసారి సీఎస్ శాంతికుమారి.. ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. రాములోరి కళ్యాణ వేడుకలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కొండా సురేఖ పాల్గొన్నారు. ఎటువంటి ప్రొటోకాల్ లేకుండా.. సామాన్య భక్తుల్లా రాములోరి కళ్యాణం తిలకించారు. సీతారాముల కల్యాణం పూర్తి కావడంతో.. భక్తులకు రాములోరి తలంబ్రాలను పంచుతున్నారు. ఇందుకోసం ఐదు లక్షల ముత్యాల తలంబ్రాల ప్యాకెట్లు సిద్ధం చేశారు. అలాగే రెండు లక్షల లడ్డూలను సిద్ధం చేశారు ఆలయ అధికారులు. ముత్యాల తలంబ్రాలను, లడ్డూలను అందించడానికి భద్రాచలంలో 60 కౌంటర్లు ఏర్పాటు చేశారు.

# అది ప్రపంచంలోనే అతిపెద్ద బలవంతపు వసూళ్ల పథకం: రాహుల్ గాంధీ

ఘజియాబాద్: సుప్రీంకోర్టు ఆదేశాలతో రద్దు చేసిన ఎన్నికల బాండ్ల పథకాన్ని ప్రపంచంలోనే అతి పెద్ద బలవంతపు వసూళ్ల పథకంగా అభివర్ణిస్తూ ప్రధాని నరేంద్ర మోడీని అవినీతి చక్రవర్తిగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అభివర్ణించారు. బుధవారం నాడిక్కడ సమాజ్‌వాది పార్టీ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్‌తో కలసి విలేకరుల సమావేశంలో పాల్గొన్న రాహుల్ గాంధీ లోక్‌సభ ఎన్నికలలో ప్రతిపక్ష ఇండియా కూటమికి అనుకూలమైన వాతావరణం బలంగా అందని, 150 సీట్లకే బిజెపి పరిమితం అవుతుందని జోస్యం చెప్పారు. పశ్చిమ ఉత్తర్ ప్రదేశ్‌లోని ఘజియాబాద్ నుంచి ఘాజీపూర్ వరకు మార్పు ప్రభంజనం వీస్తుందని, లోక్‌సభ ఎన్నికలలో బిజెపికి ప్రజలు ఘనంగా వీడ్కోలు పలుకుతారని అఖిలేష యాదవ్ చెప్పారు. లోక్‌సభ ఎన్నికలలో ఒక్క ఓటు కూడా చీలిపోకుండా చూడాలని ఆయన అన్నారు. ఎన్నికల కోసం నిధుల సమీకరణలో పారదర్శకత కోసం ఎన్నికల బాండ్ల పథకాన్ని తీసుకువచ్చామని ప్రధాని మోడీ అన్నారని, అదే నిజమైతే సుప్రీంకోర్టు దాన్ని ఎందుకు రద్దు చేస్తుందని రాహుల్ ప్రశ్నించారు. ప్రపంచంలోనే అతి పెద్ద బలవంతపు వసూళ్ల పథకంగా ఆయన ఎన్నికల బాండ్ల పథకాన్ని అభివర్ణించారు. ప్రధాని మోడీ ఎన్నిసార్లు, ఎంతగా వివరణ ఇచ్చుకున్నా వచ్చే ప్రభావమేమీ ఉండబోదని, ప్రధాని నరేంద్ర మోడీ అవినీతి చక్రవర్తి అన్న విషయం యావద్దేశ ప్రజలకు తెలుసునని రాహుల్ ఆరోపించారు. దేశంలో పేదరికాన్ని కాంగ్రెస్ అంతం చేస్తుందని తాను చెప్పిన మాటలపై ప్రధాని విమర్శించడాన్ని ప్రస్తావిస్తూ ఒక్క చర్యతో దేశంలో పేదరికం అంతం అవుతుందని తాము ఎన్నడూ చెప్పలేదని, కాని అందుకు అవసరమైన దృఢమైన చర్యలను తీసుకుంటామని రాహుల్ తెలిపారు. ఉత్తర్ ప్రదేశ్‌లోని అమేథీ నుంచి లోక్‌సభ ఎన్నికలలో పోటీ చేయడంపై విలేకరులు ప్రశ్నించగా దీనిపై పార్టీ తీసుకునే నిర్ణయానికి కట్టుబడి ఉంటానని రాహుల్ తెలిపారు.

# 'కాంగ్రెస్‌ను టచ్ చేస్తే బీఆర్ఎస్ పునాదులు కూల్చేస్తాం'..

### మంత్రి కోమటి రెడ్డి కీలక వ్యాఖ్యలు..

కాంగ్రెస్?ను కేసిఆర్ టచ్ చేస్తే బీఆర్ఎస్ పునాదులను కూల్చేస్తామని హెచ్చరించారు. తెలంగాణ లోక్ సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. ఈ నేపథ్యంలోనే బీఆర్ఎస్ పాలనను ఉద్దేశించి మంత్రి కోమటి రెడ్డి వెంకట రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. దేశంలోనే దరిద్రమైన పాలన అందించిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదని విమర్శించారు.



సీఎం రేవంత్ రెడ్డి ముఖం చుడలేక కేసిఆర్ అసెంబ్లీకి రాలేదని ఆరోపించారు. తాము గేట్లు తెరిస్తే..బీఆర్ఎస్?లో ఎమ్మెల్యేలుగా ఉన్న సభ్యులు ఎవరూ మిగలరని సంచలన వ్యాఖ్యలు చేశారు. 3 నెలల్లో బీఆర్ఎస్ కనుమరుగవుతుందని జోష్యం చెప్పారు. వ్యవసాయ కుటుంబం నుండి వచ్చి.. రాజకీయాల్లో స్వతంత్రంగా ఎదిగిన రేవంత్ రెడ్డి..రాష్ట్రానికి సీఎం అయ్యారని కొనియాడారు. మెదక్?లో వెయ్యి కోట్లు ఖర్చు చేసినా కూడా బీఆర్ఎస్ గెలవదని చెప్పారు. కేసిఆర్ కుటుంబాన్ని చూస్తుంటే జాలి వేస్తోందన్నారు. సొంత బిడ్డ జైలుకు వెళ్తే..కేసిఆర్ తాను చేసిన పాపాలకు ప్రాయశ్చిత్తం చేసుకోవాలన్నారు. యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ వ్యవహారంలో జగదీష్ రెడ్డి జైలుకు వెళ్తారని హెచ్చిరించారు. రావులు అందరూ జైల్?కు వెళ్తే చర్లపల్లి జైల్ సరిపోదని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ 15 ఎంపీ సీట్లు గెలుచుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# అయోధ్యలో అద్భుత దృశ్యం? బాలరాముడికి సూర్య తిలకం

లక్నో: అయోధ్యలో శ్రీరామనవమి వేడుకలు వైభవంగా జరుగుతున్నాయి. అయోధ్య బాలరాముడి నుదుటన సూర్యకిరణాలు ప్రసరించాయి. ప్రతి సంవత్సరం శ్రీరామనవమి రోజున రాముడి నుదుటన కిరణాలతో సూర్యతిలకం దిద్దారు. రాముడి నుదుటన మూడున్నర నిమిషాలపాటు



సూర్యతిలకం దిద్దారు. దాదాపు రెండు నిమిషాల పాటు పూర్తిస్థాయి తిలకంగా రాముడు దర్శనమిచ్చారు. రాముడి నుదుటన 58 మిల్లిమీటర్ల పరిమా ణంలో సూర్య కిరణాలు ప్రసరించాయి. శ్రీరామనవమి సందర్భంగా అయోధ్యకు భక్తులు భారీగా తరలివచ్చారు. భక్తులు సూర్యతిలకం వీక్షించేందుకు అలయ సిబ్బంది ఏర్పాట్లు చేశారు. సూర్య కిరణాలు రాముడి నుదిటిపై ప్రసరించేందుకు కటకాలు, అద్దాలు, గేర్‌బాక్సులను ఉపయోగిం చామని సెంట్రల్ బిల్డింగ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ తెలిపింది. సూర్య చంద్రరాశుల తిథులు 19 ఏళ్లకు ఒకసారి కలుస్తాయి కావునా 19 గేర్ బాక్స్‌లను ఉపయోగించినట్టు సమాచారం. చాంద్రమాన తిథికి అనుకూలంగా సూర్య కిరణాలు ప్రతి సంవత్సరం శ్రీరామనవమి రోజున రాముడి నుదుటిపై ఒకే స్థానంలో ప్రసరించేలా చేస్తారు.

# రాష్ట్రమంతటా సాధారణ వర్షపాతం

### మంచి వర్షాలు కురుస్తాయన్న వాతావరణశాఖ

హైదరాబాద్,ఏప్రిల్17: రానున్న వానాకాలంలో రాష్ట్రమంతటా సాధారణ వర్షపాతం మించి అధిక వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ అంచనా వేస్తోంది. ముఖ్యంగా తూర్పు తెలంగాణ జిల్లాలైన ఉమ్మడి ఖమ్మం, ములుగు, భూపాలపల్లి, వరంగల్, హనుమకొండతోపాటు నల్గొండ, సూర్యాపేట జిల్లాల్లోని కొంత భాగంలో అధిక వర్షపాతం నమోదవుతుందని తెలిపింది. ఈ మేరకు జూన్- సెప్టెంబరు నెలల మధ్య వర్షాల ప్రభావంపై హైదరాబాద్ వాతావరణశాఖ నివేదిక విడుదల చేసింది. 'ఎల్ నినో పరిస్థితులు జూన్ నాటికి పూర్తిగా బలహీనపడతాయి. లానినా పరిస్థితులు జులైలో పుంజుకుంటాయి. నైరుతి రుతుపవనాలు జూన్ 8, 11వ తేదీల మధ్య రాష్ట్రంలోకి ప్రవేశిస్తాయని భావిస్తున్నాం. ఆ వెంటనే వానలు ప్రారంభమై జులైలో భారీ వర్షాలు నమోదవుతాయి. ఆగస్టులో సాధారణ రీతిలో కొనసాగుతూ.. తిరిగి సెప్టెంబరులో అధికంగా కురుస్తాయి' అని నివేదికలో పేర్కొంది. గతేడాది రుతుపవనాల రాక ఆలస్యం కావడం, లెక్కకు మించి వానల విరామ కాలాలు నమోదవడంతో సాగుకు విఘాతం కలిగింది. ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు నిండుకుని క్షామ పరిస్థితులు ఏర్పడ్డాయి. ఈ దఫా మాత్రం అలా ఉండదని వాతావరణశాఖ నిపుణులు సూచిస్తున్నారు.



# రాజకీయ లబ్ధి కోసమే ఎన్నికల బాండ్లు

### బిజెపి తీరుపై మండిపడ్డ మంత్రి పొన్నం

హన్మకొండ,ఏప్రిల్17: రాజకీయ లబ్ధి కోసం క్రిబ్ కో క్రింద నల్లధనాన్ని వేల కోట్ల రూపాయల విరాళాలు సేకరించి రాజకీయం చేస్తున్నారని బీజేపీపై రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మండిపడ్డారు. రాజకీయ పార్టీలు బాండ్ల రూపంలో విరాళాలు సేకరించవచ్చని మోదీ స్వయంగా చెప్పారన్నారు. నల్ల ధనాన్ని మోదీ.. ఏ విధంగా ప్రోత్సహిస్తున్నాడో అర్థం చేసుకోవచ్చునని ఆయన అన్నారు. బుధవారం హుస్నాబాద్ నియోజకవర్గ పరిధిలోని ఎల్కతుర్తి మండలం పెంచికల్ పేట గ్రామంలో నిర్వహించిన శ్రీరామనవమి వేడుకల్లో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ... శ్రీ రామనవమి శుభాకాంక్షలు తెలిపారు. రాముడి లాంటి పాలన దక్షత ప్రభుత్వానికి ఇవ్వాలని కోరుకున్నట్లు చెప్పారు. అనంతరం బీజేపీ పార్టీ వేల కోట్ల రూపాయల



బాండ్లు తీసుకున్నారని విమర్శించారు. శరత్ చంద్ర రెడ్డి అనే వ్యక్తి రూ.500 కోట్ల విరాళాలు ఇవ్వడంతో లిక్కర్ కేసులో ఆయనకు బెయిల్ వచ్చిందని మంత్రి పొన్నం అన్నారు. మరొక వ్యక్తి రూ.100 కోట్లు ఇచ్చిందని.. అంటే ఆయనకు కాంట్రాక్టు వచ్చిందని చెప్పారు. ఈ విధంగా బీజేపీ వేల కోట్ల రూపాయలు రాజకీయ లబ్ధి కోసం విరాళాలు సేకరించిందన్నారు. దీనిపై సుప్రీం కోర్టు మొట్టికాయలు వేసి బాగోతం బయటపెట్టిందన్నారు. నల్లడబ్బు వున్నోడిపై చర్య తీసుకోవాల్సింది పోయి.. బాండ్ల రూపంలో విరాళాలు సేకరిస్తారా?.. నల్లడబ్బు మీ దగ్గరికి వస్తే తెల్లగా అవుతుందా అని ప్రశ్నించారు. ఉత్తర భారతంలో బీజేపీ గ్రాఫ్ పడిపోయిందని.. లోక్ సభ ఎన్నికల్లో ఇండియా కూటమి అధికారంలోకి వస్తుందని చెప్పారు. రాష్ట్రంలో రాముడి దయతోనే సుపరిపాలన అందిస్తామని మంత్రి పొన్నం తెలిపారు.



# కాంగ్రెస్ స్టార్ కాంపెయినర్గా రేవంత్

### కేరళలో రెండ్రోజుల పాటు ప్రచారం

హైదరాబాద్,ఏప్రిల్17 : కాంగ్రెస్ పార్టీ నేషనల్ స్టార్ క్యాంపెయినర్ గా తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి వ్యవహరించనున్నారు. ఎన్నికల ప్రచారానికి రావాలని 7 రాష్ట్రాల పీసీసీల నుంచి రేవంత్ కు ఆహ్వానం వచ్చింది. ఇందులో ఏపీ, కర్ణాటక,మహారాష్ట్ర,కేరళతో పాటు తమిళనాడు,బీహార్ ,గుజరాత్ రాష్ట్రాలు ఉన్నాయి. ఇప్పటికే సీఎం రేవంత్ రెడ్డి ప్రచార షెడ్యూల్ ఖరారైంది. కేరళలో రెండు రోజులు రేవంత్ ప్రచారం చేయనున్నారు. రాహుల్ గాంధీ పోటీ చేస్తున్న వయనాడ్ తో పాటు కేసీ వేణుగోపాల్ పోటీ చేస్తున్న అలప్పుజ సెగ్మెంట్లలో క్యాంపెయిన్ చేయనున్నారు. మరో వైపు ఏప్రిల్ 19 నుంచి వచ్చేనెల 11 వరకు రాష్ట్రంలో సీఎం రేవంత్ సుడిగాలి పర్యటన చేయనున్నారు రేవంత్.

# శ్రీ ప్రస్థానం

## సంపాదకీయం

## వ్యక్తిగత స్వేచ్ఛ ఎండమావేనా

రాజకీయాల్లో పార్టీల వ్యూహాలు అనూహ్యంగా మారుతున్నాయి. ప్రత్యర్థులను, విపక్షాలను కట్టడి చేయడానికి అధికార పార్టీలు ఫోన్ ట్యాపింగ్‌ను బ్రహ్మాస్త్రంగా మార్చుకుంటున్నాయి. దేశంలోనే కాకుండా ప్రపంచంలో కూడా ఫోన్ ట్యాపింగ్‌కు కూలిపోయిన రాజ్యాలు, రాజ్యాధినేతలున్నారు. ఈ పార్టీ, ఆ పార్టీ అనే భేదం లేకుండా అధికారంలో ఉన్న పార్టీలన్నీ తన బలాన్ని ప్రజాభిమానంతో పెంచుకోవడం కన్నా ప్రత్యర్థుల కదలికలను, వ్యూహాలను ఫోన్ ట్యాపింగ్‌తో తెలుసుకుని కౌంటర్‌గా వ్యూహాలు అమలు చేయడంతో పాటు ప్రత్యర్థులను లేదా తస్మదీయులపై కేసులు పెట్టడం కూడా సరికొత్త రాజనీతిగా కనిపిస్తున్నది. ప్రస్తుతం తెలంగాణ రాజకీయాలను 'టెలిఫోన్ ట్యాపిం గ్' కుదిపివేస్తున్నది. పదేళ్లుగా అధికారంలో ఉన్న బిఆర్ఎస్‌ను ఎదుర్కోవడానికి కాంగ్రెస్, బిజెపిలు 'టెలిఫోన్ ట్యాపింగ్' ను ప్రధాన ఆయుధంగా మార్చుకోవడంతో లోక్‌సభ ఎన్నికల ముందు ఇదే ప్రధానాంశంగా మారింది. ప్రజల్లో కూడా చర్చనీయాంశమైంది. అగ్ర రాజ్యంగా పేరు పొందిన అమెరికాలో 1974లోనే ఫోన్ ట్యాపింగ్‌లో అప్పటి అధ్యక్షుడు రిచర్డ్ నిక్సన్ నేరారోపణ రుజువు కావడంతో తన పదవికి రాజీనామా చేశారు. ఇది వాటర్ గేట్ కుంభకోణంగా ప్రపంచ వ్యాప్తంగా చరిత్రకెక్కింది. దేశంలో కూడా గుజరాత్, మహారాష్ట్ర, కర్నాటకలలో అధికార పార్టీలు తమ ప్రత్యర్థులపై నిఘాను అనధికారికంగా అమలు చేసి అప్రతిష్ఠపాలయ్యారు. ముఖ్యంగా కర్నాటకలో అప్పటి ముఖ్యమంత్రి రామకృష్ణ హెగ్డే తన ప్రధాన ప్రత్యర్థి దేవగౌడపై టెలిఫోన్ ట్యాపింగ్ చేసి ఆధారాలతో సహా దొరికిపోయి నైతిక బాధ్యతగా రాజీనామా చేశారు. చరిత్రలో ఇలాంటివి అనేక రాష్ట్రాల్లో, దేశాల్లో జరుగుతున్నా బయటికి వచ్చేవి కొన్ని మాత్రమే. గతంలో ప్రభుత్వాలు, రాజ్యాధినేతలు టెలిఫోన్ ట్యాపింగ్‌లో ఇరుక్కుపోయిన చేదు అనుభవాలున్నా రాజ్యాధినేతలు టెలిఫోన్ ట్యాపింగ్‌నే ఆయుధంగా మార్చుకోవడం ఆధునిక రాజ్యనీతిగా మారింది. ప్రస్తుతం తెలంగాణలో ప్రకంపనలు సృష్టిస్తున్న టెలిఫోన్ ట్యాపింగ్ రోజుకో మలుపు తిరుగుతున్నది. సీనియర్ పోలీసు అధికారులు సహా అనేక మంది రాజకీయ నేతలు పేర్లు కూడా బయటికి వస్తున్నాయి. అయితే ఇవి సాక్షాధారాలతో ఎలా రుజువు అవుతాయనేది ఇప్పుడే చెప్పలేకున్నా అసలు టెలిగ్రాఫిక్ చట్టం ప్రకారం టెలిఫోన్‌ను ట్యాప్ చేయడం నేరం. దీనికి తగిన శిక్షలున్నాయి. రాజకీయ నేతలెవరికీ ఈ చట్టం ప్రకారం శిక్షలు పడలేదు. ఇండియన్ టెలిగ్రాఫిక్ యాక్ట్ సెక్షన్ 5(2) ప్రకారం ఇతరుల ల్యాండ్ లేదా మొబైల్ ఫోన్ సంభాషణలు వినడం నేరం. ఇది వ్యక్తిగత స్వేచ్ఛకు పూర్తిగా భంగకరం. దేశ రక్షణ, సమగ్రత, సార్వభౌమాధికారానికి ప్రమాదం ఏర్పడిన అరుదైన సందర్భాలలోనే ట్యాపింగ్‌ను అనుమతిస్తారు. అది కూడా కేంద్ర, రాష్ట్ర హోం సెక్రటరీలు అనుమతించాలి. ట్యాపింగ్‌కు అనుమతి అవసరమనుకుంటే హోం సెక్రటరీలు తొలుత 2 నెలలకే అనుమతిస్తూ ట్యాపింగ్ ఆర్డర్ ఇస్తారు. అది ప్రత్యేక పరిస్థితిలో 6 నెలలకు మించకూడదు. దీనిని నియంత్రించడానికి ప్రత్యేక రివ్యూ కమిటీ కూడా ఉంటుంది. దీనికి తోడు సుప్రీం కోర్టు కూడా పలు సందర్భాల్లో టెలిఫోన్ ట్యాపింగ్ చట్ట అనుమతి దుర్వినియోగం కాకుండా అనేక పరిమితులు కూడా విధించింది. దేశంలో అనేక రాష్ట్రాల్లో ట్యాపింగ్ అనేది అధికార పార్టీ చేతిలో బ్రహ్మాస్త్రంగా మారింది. నేటి ప్రధాని నాటి గుజరాత్ ముఖ్యమంత్రి నరేంద్ర మోడీ గుజరాత్ రాష్ట్రంలో కూడా టెలిఫోన్ ట్యాపింగ్‌ను దుర్వినియోగం చేశారనే ఆరోపణలు వచ్చాయి. ఆ రాష్ట్రంలో ఒక మహిళ టెలిఫోన్‌ను ట్యాప్ చేశారని అప్పట్లో రాజకీయ ప్రకంపనలు చెలరేగాయి. ట్యాపింగ్‌లో కూడా ఆధునికత చోటు చేసుకున్నది. టెక్నాలజీ పెరుగుదలతో పాటు సంభాషణలు వినే రికార్డు చేసే అత్యాధునిక సామగ్రి ప్రపంచ విపణిలో సులభంగా దొరుకుతున్నది. ముఖ్యంగా ఇజ్రాయెల్ దేశం పెగాసస్ అనే సాఫ్ట్‌వేర్ ద్వారా టెలిఫోన్ ట్యాపింగ్‌ను విచ్చలవిడిగా వినియోగిస్తున్నదని ఎప్పటి నుంచో ప్రచారం జరుగుతున్నది. కాని అటు కేంద్రంలో, ఇటు రాష్ట్రంలో టెలిఫోన్ ట్యాపింగ్‌ను నియంత్రించే ప్రత్యేక చట్టాలు ఎవరూ చేయడం లేదు. ఈ ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో 100,000 కంటే ఎక్కువ ఫోన్ కాల్స్ అక్రమంగా ట్యాప్ చేయబడినట్లు నివేదికలు పేర్కొన్నాయి. ఇందులో ప్రధానంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు, భారతీయ జనతా పార్టీ (బిజెపి), కాంగ్రెస్, బిఆర్ఎస్ నాయకులు, రియాల్టర్లు, ప్రముఖ నేతల ఫోన్లు ట్యాప్ చేసినట్టు తెలుస్తోంది. అలాగే.. సినీ, వ్యాపార ప్రముఖులను బ్లాక్ మెయిల్ చేసి.. వారి నుంచి భారీ మొత్తంలో డబ్బులు దోచుకున్నట్టు ఆరోపణలున్నాయి.

## 'పెద్ద 'పల్లి 'బాద్షా 'ఎవరు అయ్యేనో..?

**జోరందుకున్న ఎన్నికల ప్రచారం.**
**ముక్కోణపు పోటీలో గెలుపు ఎవరిదో.**
**పెద్దపల్లి సభ తో జోరు పెంచి జోష్ లో 'కాంగ్రెస్'**

పెద్దపల్లి,పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గం లో మూడు ప్రధాన పార్టీలైన కాంగ్రెస్ టిఆర్ఎస్ బిజెపి పార్టీల నడుమ హోరా హోరికొనసాగుతోంది. సోమవారం పెద్దపల్లి పట్టణంలోని బంధం పల్లె వద్దగల స్వరూప గార్డెన్లో పెద్దపల్లి పార్లమెంట్ స్థాయి సమావేశాన్ని కాంగ్రెస్ పార్టీ ఏర్పాటు చేయగా కాంగ్రెస్ పార్టీలోకి మంథని పెద్దపల్లి రామగుండం అసెంబ్లీ నియోజకవర్గాల్లోని జెడ్పిటిసిలు నాయకులు మాజీ సర్పంచులు ఎంపీటీసీలు విజయ రమణారావు శ్రీధర్ బాబుల సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ పార్టీ దినదినం బలోపేతం కోసం శతవిధాల ప్రయత్నం చేస్తోంది. పెద్దపల్లిలో ఎలాగైనా భారీ మెజార్టీతో గెలిచి తీరాలనే దృక్పథంతో గడ్డం వివేక్ వెంకటస్వామి తన కుమారుడైన వంశీ కృష్ణ గెలుపు కొరకు ప్రతి అసెంబ్లీ స్థానంలో పెద్ద ఎత్తున కార్యకర్తలను పోవు చేసి భారీ ఎత్తున సమావేశాలు నిర్వహిస్తున్నారు. దీంతో కాంగ్రెస్ పార్టీ ప్రచారంలో దూకుడు పెంచి ముందు వరుసలోకి వచ్చింది. అలాగే ఆరుసార్లు ఎమ్మెల్యేగా రాష్ట్ర ప్రభుత్వ విప్ గా రాష్ట్ర మంత్రిగా పనిచేసిన టిఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ కోల్ బెల్ట్ ప్రాంతంలో తిరుగుతూ ముమ్మర ప్రచారం చేస్తున్నారు. బిజెపి అభ్యర్థి గోమాత శ్రీనివాస్ సైతం కేంద్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులను ప్రజల్లోకి తీసుకెళ్తూ ప్రచారంలోకి దూసుకెళు న్నారు. ప్రచారంలో మూడు పార్టీలు ఎత్తులు పైఎత్తులు వేస్తున్నారు . నాయకులు గెలుపుపై ధీమా ఎవరి ధీమా వారే వ్యక్తం చేస్తున్నారు. పార్లమెంటు ఎన్నికలపై ప్రధాన పార్టీలన్నీ ఫోకస్ పెట్టా యి.. పెద్దపల్లి పార్లమెంట్ స్థానంలో త్రిముఖ పోరు నెలకొంది. మూడు ప్రధాన పార్టీలు ప్రచార స్పీడ్ను పెంచాయి. మూడు పార్టీల అభ్యర్థు లు ఖరారు అయిన నేపథ్యంలో ప్రచారంలో ఎత్తులు పైఎత్తులు వేస్తు న్నాయి. ప్రతి ఒక్కరిని కలిసి ఓటును అభ్యర్థిస్తున్నాయి. ఈ మూడు పార్టీల నాయకులు గెలుపుపై ధీమాని వ్యక్తం చేస్తూ ప్రచారంలో దూసుకుపోతున్నారు. పెద్దపల్లి పార్లమెంటు పరిధిలో మూడు పార్టీల అభ్యర్థులు గత పదిహేను రోజుల నుండి ప్రచారాన్ని ముమ్మరం చేస్తున్నాయి. కాంగ్రెస్ నుంచి గడ్డం వంశీకృష్ణ, బీఆర్ఎస్ నుంచి కొప్పుల ఈశ్వర్, బీజేపీ నుంచి గోమాస శ్రీనివాస్ బరిలో ఉన్నారు. కాంగ్రెస్ ఇక్కడ పార్లమెంటు పరిధిలోని ఏడు అసెంబ్లీ స్థానాలని కైవసం చేసుకుంది. ప్రతిపక్ష పార్టీలు గత అసెంబ్లీ ఎన్నికలలో గట్టి పోటీ ఇవ్వలేక పోయాయి. కాంగ్రెస్ టికెట్ విషయంలో మొదట విభేదాలు ఉన్నప్పటికీ తరువాత సద్దుమణిగాయి. ఇప్పుడు లోక్సభ పరిధిలోని ఏడుగురు ఎమ్మెల్యేలు కాంగ్రెస్ గెలుపు కోసం పనిచేస్తున్నారు. ఇక్కడ అత్యధికంగా సింగరేణి కార్మికులు ఉన్న కారణంగా వారి ఓట్లని రాబట్టుకునే ప్రయత్నం చేస్తున్నాయి అన్ని పార్టీలు. వంశీకృష్ణ నాన్న, పెద్ద నాన్న ఈ లోక్సభ నియోజకవర్గం పరిధిలో ఎమ్మెల్యేలుగా కొనసాగుతున్నారు. దాదాపుగా అసెంబ్లీ కేంద్రాలతో పాటు, మండల కేంద్రాలు మేజర్ గ్రామ పంచాయతీలలో సమావేశం నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా బీఆర్ఎస్, బీజేపీ పైనా విమర్శలు చేస్తూ ప్రజల్లోకి వెళ్తున్నారు. బీఆర్ఎస్, బీజేపీ సింగరేణి ప్రైవేటీకరణ చేసేందుకు ప్లాన్ చేశాయని కాంగ్రెస్ నేతలు బలంగా జనంలోకి తీసుకువెళ్తున్నారు. కార్మికుల ఓట్లకు గాలం వేసి ప్రతిపక్షాలపై విమర్శలు గుప్పిస్తున్నారు. అటు, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ బీఆర్ఎస్ అభ్యర్థిగా ప్రచారాన్ని ముమ్మరంచేశారు. ఈయన గతంలో సింగరేణి కార్మికుడు కావడంతో సింగరేణి కార్మికుల ఓట్లు తమకే వస్తాయని ధీమాగా ఉన్నారు.

బీఆర్ఎస్ ప్రభుత్వంలోనే కొత్త ఉద్యోగాల కల్పన, కార్మికుల సమస్యలను పరిష్కరించమని ప్రస్తావిస్తున్నారు. తమ ఉద్యమం కారణంగానే సింగరేణి ప్రైవేటీకరణ కాలేదని సమావేశాలలో గుర్తు చేస్తున్నారు. ఆరు గ్యారంటీలు అటకెక్కాయని, బీఆర్ఎస్ నేతలు అంటున్నారు. రైతులకు ఇబ్బందులు వచ్చినా అటువైపు చూడని కాంగ్రెస్ కి గుణపాఠం తప్పదని కొప్పుల విపర్శిస్తున్నారు. బీజేపీ అభ్యర్థి గోమాస శ్రీనివాస్ పూర్తిగా మోదీ హావానే నమ్ముకున్నారు. అయన సామజిక వర్గం ఓట్లు ఎక్కువగా ఉండడంతో గెలుపులో కీలక పాత్ర పోషిస్తాయని భావిస్తున్నారు. కుటుంబ పార్టీ అయిన కాంగ్రెస్, బీఆర్ఎస్లకు గుణపాఠం తప్పదని అంటున్నారు. రాష్ట్రంలో అధికారం కోల్పోయిన బీఅర్ఎస్కు ఓటు వేసిన వృధా అని విమర్శలు చేస్తున్నారు. ఈ మూడు పార్టీల అభ్యర్థులు విమర్శలు, ప్రతి విమర్శలు చేసుకుంటూ ప్రచారాన్ని వేడెక్కిస్తున్నారు. కాగా పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలో ఏడు స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థులే ఎమ్మెల్యేలుగా ఉండడంతో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ రాష్ట్రప్రభుత్వం ఆరు గ్యారెంటీ పథకాలు అమలుతో ముందుకెళ్తూ ఎలాగైనా గెలిచి తీరుతామని ధీమాతో ఉన్నారు. అలాగే బిజెపి కేంద్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులే తనను గెలిపిస్తాయని గోమాస శ్రీనివాస్ ధీమా వ్యక్తం చేస్తున్నారు. తనకు పాత పరిచయాలే ఈ పార్లమెంట్లో ఎలాగైనా గెలిపిస్తాయని మాజీ మంత్రి టిఆర్ఎస్ అభ్యర్థి కోపుల ఈశ్వర్ నమ్మకంతో ఉన్నారు.

## నాన్ వెజ్ ప్రియులకు అలెర్ట్.. ఈ ఆదివారం షాపులు బంద్


మాంసం ప్రియులకు ఇది నిజంగా బ్యాడ్ న్యూస్ అని చెప్పాలి. అవును? ఆదివారం వచ్చిందంటే నాన్ వెజ్ ప్రియులకు పండగే. చికెన్, మటన్, ఫిష్.. వారికి నచ్చిన మీట్ కోసం షాపుల ముందు క్యూ కడతారు. సాధారణంగా ఆదివారం పూట చాలా ఇళ్లల్లో మాంసం వంటకాల గుమగుమలు గుబాళిస్తుంటాయి. ప్రతీ ఆదివారం ముక్క రుచి చూడనిదే కొందరు అస్సలు ఉండలేకపోతుంటారు. వర్క్ హాలిడే, జాబ్ హాలిడే? సండే స్పెషల్ అంటే.. చికెన్, మటన్ కూడా చాలామందే



ఉన్నారు. అయితే, ఈ ఆదివారం మాత్రం హైదరాబాద్ వాసులు మాంసాహారం దొరకదు. ఎందుకంటే.. ఈ నెల 21న సిటీలోని మటన్ షాపులతో పాటు కబేళాలు, మీట్, బీఫ్ మార్కెట్స్ క్లోజ్ చేస్తున్నారు. ఈమేరకు గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కబేళాలు, మాంసం దుకాణాలను ఆదివారం బంద్ చేయాలని ఆదేశాలు జారీ చేసింది. మహావీర్ జయంతి సందర్భంగా జీహెచ్ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రాస్.. ఈ మేరకు ఉత్వర్వుల జారీ చేశారు. జైనులు జరుపుకునే పండుగలలో మహావీర్ జయంతి అత్యంత ముఖ్యమైన పండుగ. ఈ నేపథ్యంలోనే మహావీరుడి జన్మదినం సందర్భంగా హైదరాబాద్‌లోని కబేళాలతో పాటు మాంసం దుకాణాలను మూసివేయాలని ఆదేశించినట్లు ఉఊఓఅ కమిషనర్ రొనాల్డ్ రాస్ పేర్కొన్నారు. ఆదేశాలను అతిక్రమించి ఎవరైనా నాన్ వెజ్ షాపులు ఓపెన్ చేస్తే.. కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ క్రమంలో, ఉత్తర్వులను అమలు చేయడంలో మున్సిపల్ సిబ్బందికి అవసరమైన సహకారం అందించడానికి సంబంధిత అధికారులను ఆదేశించాలని రోనాల్డ్ రోస్ ఉఊఓఅ పరిధిలోకి వచ్చే మూడు పోలీసు కమిషనరేట్‌లను అభ్యర్థించారు. తిరిగి సోమవారం యథావిధిగా కబేళాలు తెరుచుకోవచ్చని కమిషనర్ పేర్కొన్నారు.

## 40 డిగ్రీలు దాటిన టెంపరేచర్

హైదరాబాద్, ఏప్రిల్ 17, తెలంగాణ రాష్ట్రంలో కింది స్థాయి గాలులు దక్షిణ, ఆగ్నేయ దిశ నుంచి వీస్తున్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. ఈ రోజు, రేపు, ఎల్లుండి రాష్ట్రంలో పొడి వాతావరణం ఏర్పడే అవకాశం ఉందని తెలిపారు. ఈరోజు నుండి 2 రోజులు తెలంగాణ రాష్టంలో కొన్ని జిల్లాలలో అక్కడ అక్కడ గరిష్ట ఉష్ణోగ్రత్తలు క్రమేణా 2 నుంచి 3 డిగ్రీల సెంటిగ్రేడ్ వరకు పెరిగే అవకాశం ఉందని తెలిపారు. రేపు, ఎల్లుండి తెలంగాణ రాష్ట్రంలో కొన్ని జిల్లాలలో అక్కడక్కడ వడగాలులు వీచే అవకాశం ఉందని అంచనా వేశారు. తెలంగాణలోని కొమురం భీమ్ ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, జగిత్యాల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, సూర్యాపేట జిల్లాల్లో అక్కడక్కడ వేడిగాలులు వీచే అవకాశం ఉంది. ఈ ప్రాంతాల్లో ఎల్లో అలర్ట్ జారీ చేశారు. హైదరాబాద్ లో ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. గరిష్ఠ, కనిష్ఠ ఉష్ణోగ్రతలు వరుసగా 40 డిగ్రీలు, 27 డిగ్రీలుగా ఉండే అవకాశం ఉంది. ఉపరితల గాలులు గంటకు 6 నుంచి 8 కిలో మీటర్ల వేగంతో నైరుతి దిశగా ఉండే అవకాశం ఉంది. నిన్న గరిష్ఠ ఉష్ణోగ్రత 39.1 డిగ్రీలు, కనిష్ఠ ఉష్ణోగ్రత 27.1 డిగ్రీలుగా నమోదైంది. 39 శాతంగా గాలిలో తేమ శాతం నమోదైంది. రాయలసీమ మీద ఉన్న ఉపరితల ఆవర్తనం సగటు సముద్ర మట్టానికి 1.5 కిలో మీటర్ల ఎత్తులో ఉంది. ఆంధ్రప్రదేశ్, యానాంలో దిగువ ట్రోపో ఆవరణలో దక్షిణ దిశగా గాలులు వీస్తున్నాయి. ఈ వాతావరణ ప్రభావంతో ఉత్తర కోస్తాంధ్ర, యానం ప్రాంతాల్లో వాతావరణం పొడిగా ఉండే




అవకాశం ఉంది. వేడి, తేమ, అసౌకర్యమైన వాతావరణం ఒకటి లేదా రెండు చోట్ల ఏర్పడవచ్చు. దక్షిణ కోస్తాంధ్రలో వాతావరణం పొడిగా ఉండే అవకాశం ఉంది. వేడి, తేమ, అసౌకర్యమైన వాతావరణం ఒకటి లేదా రెండు చోట్ల ఏర్పడే అవకాశం ఉంది. రాయలసీమలోనూ వాతావరణం పొడిగా ఉండే అవకాశం ఉంది. వేడి, తేమ, అసౌకర్యమైన వాతావరణం ఒకటి లేదా రెండు చోట్ల ఏర్పడే అవకాశం ఉందని అమరావతి వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. వడగాలులు రాయలసీమలో ఒకటి లేదా రెండు చోట్ల వీచే అవకాశం ఉందని అధికారులు వెల్లడించారు.

## మోడీ మళ్లీ గెలిస్తే అంబేడ్కర్ రాసిన రాజ్యాంగం ఉండదు: స్టాలిన్




చెన్నై: మోడీ ప్రభుత్వం మూడో సారి వస్తే డా బిఆర్ అంబేడ్కర్ రాసిన రాజ్యాంగం ఆర్ఎస్ఎస్ నియమాలతో భర్తీ చేస్తారని డిఎంకె అధ్యక్షుడు, తమిళనాడు సిఎం ఎంకె స్టాలిన్ తెలిపారు. తమిళనాడులోని శ్రీపెరంబుదూరులో జరిగిన ర్యాలీలో స్టాలిన్ మాట్లాడారు. మోడీ మళ్లీ ప్రధాని అయితే సైన్స్ వెనక్కి నెట్టివేయబడుతుందని, మూఢనమ్మకాలకు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తారని మండిపడ్డారు. అప్పుడు దేశం 200 ఏళ్లు వెనక్కి వెళ్తుందని, ఇవన్నీ ఆపాలంటే బిజెపికి వ్యతిరేకంగా ఓటు వేయాలని సూచించారు. బిజెపికి ఓటు వేస్తే తమిళనాడు శత్రువులకు ఓటు వేసినట్టేనని పేర్కొన్నారు. అన్నాడిఎంకె, బిజెపిలు స్నేహితులు అని, ఈ ఎన్నికలలో విడిపోయినట్టుగా నటిస్తున్నారని విమర్శలు గుప్పించారు. కేంద్రం నుంచి తనకు అనేక అవార్డులు వచ్చాయని మాజీ ముఖ్యమంత్రి, అన్నాడిఎంకె ప్రధాని కార్యదర్శి పళని స్వామి చెప్పుకోవడంపై స్టాలిన్ సైటెర్లు వేశారు. బానిసలలో ఉత్తముడిగా పళనిస్వామికి అవార్డులు వచ్చాయని ఎద్దేవా చేశారు. ఇండియా కూటమిని ప్రజలు విశ్వసిస్తున్నారని జోస్యం చెప్పారు.

## వంశీతిలక్ ఎంట్రీతో మార్పు

హైదరాబాద్, ఏప్రిల్ 17 (న్యూస్ పల్స్)లోక్‌సభ ఎన్నికలతోపాటు తెలంగాణలో కంటోన్మెంట్ అసెంబ్లీ స్థానానికి ఉప ఎన్నిక జరుగనుంది. 2023 ఎన్నికల్లో ఇక్కడి నుంచి దివంగత ఎమ్మెల్యే సాయన్న కూతురు లాస్య నందిత పోటీ చేసి విజయం సాధించింది. బీజేపీ అభ్యర్థి శ్రీగణేశ్ రెండో స్థానంలో నిలవగా, కాంగ్రెస్ మూడో స్థానానికి పరిమితమైంది. ఇక లాస్య నందిత రెండు నెలల క్రితం రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందింది. దీంతో ఉప ఎన్నిక అనివార్యమైంది. లోక్‌సభ ఎన్నికలతోపాటు ఉప ఎన్నిక నిర్వహించేందుకు ఈసీ షెడ్యూల్ విడుదల చేసిందిఇక లాస్య నందిత మరణంతో ఖాళ అయిన కంటోన్మెంట్ స్థానాన్ని నిలుపుకోవాలని బీఆర్ఎస్ ప్రయత్నిస్తోంది. ఇందుకోసం లాస్య నందిత సోదరి నివేదితను అభ్యర్థిగా కేసీఆర్ ప్రకటించారు. ఇక అధికారం కాంగ్రెస్ ఈసారి కంటోన్మెంట్‌ను తన ఖాతాలో వేసుకోవాలని చూస్తోంది. ఈ నేపథ్యంలో గత ఎన్నికల్లో బీజేపీ తరఫున పోటీ చేసి రెండో స్థానంలో నిలిచిన శ్రీగణేశ్‌ను కాంగ్రెస్‌లో చేర్చుకుని అభ్యర్థిగా ప్రకటించింది. దీంతో బీజేపీ కొత్త అభ్యర్థి వేటలో పడింది. ఇక భారతీయ జనతాపార్టీ కూడా తాజాగా కంటోన్మెంట్ ఉప ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థిని ప్రకటించింది. టీఎన్.వంశీతిలక్ పేరును ఖరారు చేసింది. ఈ మేరకు ఆయన పేరును అధికారికంగా మంగళవారం ప్రకటించింది. కంటోన్మెంట్ అభ్యర్థి కోసం మూడు పేర్లను బీజేపీ రాష్ట్ర నాయకత్వం పరిశీలించి జాతీయ నాయకత్వానికి పంపించింది. చివరకు వంశీ తిలక్‌కు టికెట్ ఖరారు చేసింది. వంశీ తిలక్ అందరికీ సుపరిచితుడు కావడంతో ఆయనను ఎంపిక చేస్తూ అధినాయకత్వం నిర్ణయం తీసుకుంది. తిలక్ మాజీ మంత్రి సదాలక్ష్మి, పద్మశ్రీ అవార్డు గ్రహీత టీవీ.నారాయణ దంపతుల కుమారుడు. వైద్య వృత్తిలో ఉన్నారు. సదాలక్ష్మి తెలంగాణ తొలి దశ ఉద్యమంలో కీలకంగా వ్యవహరించారు. అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్‌తోపాటు బీజేపీ కూడా తమ అభ్యర్థులను ప్రకటించిన నేపథ్యంలో కంటోన్మెంట్‌లో ఈసారి ముక్కోణపు పోటీ ఖాయంగా కనిపిస్తోంది. మూడు పార్టీలు కంటోన్మెంట్‌ను తమ ఖతాలో వేసుకోవాలని చూస్తున్నాయి. ఈ నేపథ్యంలో బలమైన అభ్యర్థులనే బరిలో దించాయి. ఉప ఎన్నికల మే 13న జరుగుతుంది. మరి విజయం ఎవరిని వరిస్తుందో చూడాలి.

## నివేదిత కు డబుల్ బెడ్ రూమ్ సెగ

హైదరాబాద్, ఏప్రిల్ 17 (న్యూస్ పల్స్) బీఆర్ఎస్ మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత గడ్డు పరిస్థితిని ఎదుర్కొంటోంది. ఒకవైపు కాళేశ్వరం, విద్యుత్ ఒప్పందాల్లో అక్రమాలు, ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం, లిక్కర్ స్కాంలో కవిత జైలుకు వెళ్లడం వంటివి ఆ పార్టీని ఇబ్బంది పెడుతున్నాయి. మరోవైపు గులాబీ పార్టీలో ఉండి పదేళ్లు వివిధ పదవులు అనుభవించిన వారు అధికార కాంగ్రెస్‌లో చేరుతున్నారు. సిట్టింగ్ ఎమ్మెల్యేలకు కూడా పార్టీ మారుతున్నారు. ఈ క్రమంలో పార్టీ అధినేత కేసీఆర్‌కు, ఆ పార్టీ కంటోన్మెంట్ అభ్యర్థి నివేదితకు డబుల్ సెగ తగిలింది. నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్ల ఇవ్వడం లేదని మొన్న కేసీఆర్ ఫామ్‌హౌస్ వద్ద ఇల్లు కేటాయించాలని ఆందోళన చేశారు. ఇక నిన్న నివేదిత ఇంటి వద్ద డబుల్ బెడ్‌రూం పేరుతో తమ నుంచి వసూరు చేసిన డబ్బులు ఇవ్వాలని బాధితులు ఆందోళనకు దిగారు. దీంతో నివేదిత నివాసం వద్ద ఉద్రిక్తత నెలకొంది. బీఆర్ఎస్‌కు చెందిన నేతలు, సాయన్న అనుచరులుగా ముద్ర పడిన వారే డబుల్ బెడ్రూం ఇళ్ల కోసం ఆందోళన చేయడం సంచలనంగా మారింది. నియోజకవర్గంలో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్లు ఇస్తామని పేరుత దివంగగత ఎమ్మెల్యేలు సాయన్న, ఆయన కుమార్తె లాస్య నందిత, ప్రస్తుత బీఆర్ఎస్ అభ్యర్థిథ నివేదిత నియోజకవర్గంలోని ప్రజల నుంచి రూ.1.46 కోట్లు వసూలుచేసినట్లు బీఆర్ఎస్ లీడర్ సదానంద్‌గౌడ్ తెలిపారు. నియోజకవరలోని 30 మంది నుంచి రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు తీసుకున్నారని ఆరోపించారు. ఇండ్ల కోసం ఒత్తిడి చేయగా గతేడాది రూ.12 లక్షలు తిరిగి ఇచ్చారని తెలిపారు. మిగతా రూ.1.34 కోట్లు ఇవ్వాలని ఇంటి చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వసూలు చేసిన డబ్బులు ఇవ్వకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఇదిలా ఉండగా బీఆర్ఎస్ సర్కార్ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన డబుల్ బెడ్ రూం ఇళ్ల పంపిణీలో భారీగా అక్రమాలు వెలుగులోకి వస్తున్నాయి. అర్హులైన ప్రతీ పేదవాడికి పైరవీలు లేకుండా డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇస్తామని చెప్పిన మాజీ సీఎం కేసీఆర్ మాటలకు.. క్షేత్రస్థాయిలో జరుగుతున్న ఘటనలకు చాలా తేడా ఉంది. ఈ క్రమంలో దివంగత ఎమ్మెల్యే లాస్య నందిత వసూళ్ల దందాకు చెందిన ఆడియో గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు వైరల్‌గా మారింది. ఆ ఆడియో.. దివంగత ఎమ్మెల్యే లాస్య నందితది అని తేలింది. డబుల్ బెడ్ రూమ్ ఇల్లు కోసం ఓ వ్యక్తి నుంచి రూ.5 లక్షలు డబ్బులు తీసుకున్నట్టు ఈ ఆడియో ద్వారా తెలిసింది. ఇళ్లు ఇవ్వకపోగా.. తీసుకున్న డబ్బులు తిరిగి ఇవ్వకపోవడంతో ఈ వివాదం జరిగింది.

## 'ఆప్ కా రామరాజ్య'.. వెబ్‌సైట్‌ను ప్రారంభించిన ఆప్

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో అధికారంలో ఉన్న ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) లోక్‌సభ ఎన్నికలపై దృష్టి సారించింది. ఇందులో భాగంగా 'ఆప్ కా రామరాజ్య' వెబ్‌సైట్‌ను బుధవారం ప్రారంభించింది. రాముడి ఆదర్శాలను సాకారం చేసేందుకు ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ ప్రయత్నించారని ఆ పార్టీ పేర్కొంది. ఆప్ నేతలు సంజయ్ సింగ్, అతిషి, సౌరభ్ భరద్వాజ్, జాస్మిన్ షా ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడారు. ఢిల్లీలో ఆప్ ప్రభుత్వం 'రామరాజ్యం' భావనతో పని చేసిందని తెలిపారు. 'రామరాజ్యం' సాకారం కోసం ముఖ్యమంత్రి కేజ్రీవాల్ గత పదేళ్లలో అద్భుతమైన విజయాలు సాధించారని చెప్పారు. మంచి పాఠశాలలు, మొహల్లా క్లినిక్‌లు, ఉచిత తాగు నీరు, ఉచిత విద్యుత్తు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటి పథకాలు ప్రవేశపెట్టారని అన్నారు. కాగా, మద్యం పాలసీ కేసులో అరెస్టై జైలులో ఉన్న ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్, శ్రీరామ నవమి రోజున తన ప్రజల మధ్య లేకపోవడం ఇదే తొలిసారి అని సంజయ్ సింగ్ తెలిపారు. తప్పుడు సాక్షుల వాంగ్మూలం ఆధారంగా నమోదు చేసిన నిరాధార కేసులో అరవింద్ కేజ్రీవాల్‌ను అరెస్ట్ చేసి జైలుకు పంపారని ఆరోపించారు.





# సినీ ప్రస్థానం

## 'వార్ 2' లీకులతోనే భేజారు

ఆన్ లొకేషన్ నుంచి ఫోటోలు వీడియోలు లీకవ్వకుండా, అలాగే తమ సినిమాల కాన్సెప్ట్ తెలియనివ్వకుండా జాగ్రత్త పడటంలో తమిళ దర్శకుడు ఎస్.శంకర్ ఘనాపాటి అని చెబుతారు. ఆ తర్వాత ఎస్.ఎస్.రాజమౌళి అదే ఫార్ములాను అనుసరించారు. ఆ ఇద్దరు దిగ్గజ దర్శకుల సినిమాల నుంచి లీకులు అందడం దాదాపు అసాధ్యం. ఆన్ లొకేషన్ మొబైల్ ఫోన్ల వినియోగంపైనా ఆంక్షలు విధిస్తారు కాబట్టి లీకులకు ఆస్కారం ఉండదు. ఇప్పుడు 'బ్రహ్మాస్త్ర' దర్శకుడు అయాన్ ముఖర్జీ తన కెరీర్ బెస్ట్ సినిమాని తెరకెక్కిస్తూ కూడా




కేర్‌లెస్ గా ఉన్నాడని విమర్శలొస్తున్నాయి. ప్రస్తుతం అతడు ఎన్టీఆర్- హృతిక్ రోషన్ లాంటి గొప్ప స్టార్లతో భారీ మల్టీస్టారర్ చిత్రం వార్ 2 తెరకెక్కిస్తున్నాడు. ఈ సినిమా సెట్స్ నుంచి ఇప్పుడు ఫోటోలు లీక్ కావడం షాకిస్తోంది. వార్ 2 సెట్స్ నుండి లీక్ అయిన ఫోటోలలో ఎన్టీఆర్, హృతిక్ రోషన్ పూర్తిగా యాక్షన్ మోడ్‌లో కనిపిస్తున్నారు. తాజా లీక్డ్ ఫోటోలను బట్టి వారి పాత్రలు ఎలాంటివి అనేది అభిమానులు గెస్ చేస్తున్నారు. హృతిక్ ఒక సీరియస్ మిషన్ గురించి ఆలోచిస్తున్న స్పై తరహాలో కనిపిస్తున్నాడు. అతడి చేతిలో తేనీటి గ్లాస్ కనిపిస్తోంది. బ్లూ టైట్ టీషర్ట్ పై బ్లాక్ కోట్ ధరించి ఎంతో స్టైలిష్ గా కనిపిస్తున్నాడు. ఇక యంగ్ టైగర్ ఎన్టీఆర్ బ్లాక్ టీషర్ట్ స్పోర్ట్స్ మల్టీపాకెట్ ప్యాంట్ లో చాలా క్యాజువల్ గా కనిపిస్తున్నా కానీ, అతడి ఫిట్ లుక్ మరో లెవల్లో ఎలివేట్ అవుతోంది. చూస్తుంటే ఇది ఏదైనా యాక్షన్ షెడ్యూల్ అనుకోవాలా? లేక ఇంకేదైనానా? అన్నది అర్థం కాని పరిస్థితి. ఇటీవల ఎన్టీఆర్ ముంబైలో అడుగుపెట్టగానే ఈసారి షెడ్యూల్‌లో యాక్షన్ సీన్స్ తీస్తున్నారని లేదూ పాట చిత్రీకరిస్తున్నారని రకరకాలుగా ప్రచారమైంది. కానీ అసలు షూట్ ఏం జరుగుతోంది? అనేదానిపై సరైన సమాచారం లేదు. సెట్ నుంచి ఫోటో లీకులు అభిమానులను గందరగోళానికి గురి చేస్తున్నాయి. ఏది ఏమైన లీక్డ్ ఫోటోలు నందమూరి అభిమానుల్లో రకరకాలుగా చర్చలకు తావిచ్చాయి. కానీ ఇలా ముందే లీకులిచ్చేస్తే, ఆ తర్వాత సినిమా లుక్ ల లాంచ్ లు, టీజర్ లాంచ్ లపై ఆసక్తి సన్నగిల్లుతుందనే ఆందోళన ఒక వర్గంలో వ్యక్తమవుతోంది. యష్ రాజ్ ఫిలింస్ సంస్థ ఈ చిత్రాన్ని అత్యంత భారీగా నిర్మిస్తున్న సంగతి తెలిసిందే.

## బాలయ్య సినిమాలో డబ్బా రాణి!

నటసింహ బాలకృష్ణ కథానాయకుడిగా 109వ చిత్రం బాబి దర్శకత్వంలో తెరకెక్కుతోన్న సంగతి తెలిసిందే. బాలయ్య మాస్ ఇమేజ్ కి ...బాబి మాస్ కంటెంట్ తోడవ్వడంతో అంచనాలు పీక్స్ కి చేరుతున్నాయి. ఇద్దరు అభి మానుల్ని దృష్టిలో పెట్టుకుని చేస్తోన్న పక్కా మాస్ ఎంటర్ టైనర్. చిరంజీవికి 'వాల్తేరు వీరయ్య'తో బాబి ఎలాంటి హిట్ ఇచ్చాడో? బాలయ్యకి అలాంటి హిట్ ఇవ్వబోతున్నాడనే అంచనాలు భారీగానే ఉన్నాయి. మరి ఇలాంటి కాంబినేషన్ సెట్ అయినప్పుడు మాంచి పెప్పీ ఐటమ్ సాంగ్ లేకపోతే ఎలా? అలాంటి పాట లేకుండా సినిమా ఉంటుందా? అని అభిమానులు అనుకోరు. అందుకే వాళ్ల కోసం అందిరిపోయే ఐటం పాట ఒకటి ఉన్నట్లు తెలుస్తోంది. ఐటం గాళ్ ఎవరు? అన్నది ఇంకా ఫైనల్ కాలేదు గానీ..ఆ ఐటం పాటలో కనిపించే నటి పాత్ర పేరు మాత్రం డబ్బా రాణి అట.. కుర్రాళ్లకు మతిచెడే రేంజ్ లో ఈమాస్ పాట పునకాలు తెప్పిస్తుందని చిత్ర వర్గాల నుంచి లీకులందుతున్నాయి. ఇంకా ఇందులో హీరోయిన్ ఎవరు అన్నది కన్ఫమ్ కాలేదు. అలాగే ఐటం భామ కూడా ఫైనల్ కాలేదు. ఆ భామ ఎవరైనా మాస్ బీట్ మాత్రం అందిరిపోతుందని తెలుస్తోంది. డైరెక్టర్ ప్లాన్ మామూలుగా లేదు బాబి అలాంటి మాస్ సాంగ్లని డిజైన్ చేయడంలో ఎక్స్ పర్ట్ అని చెప్పాల్సిన పనిలేదు. ఇప్పటివరకూ ఆయన తెరకెక్కించిన సినిమాలన్నింటిలోనే ఐటం పాటలు మంచి సక్సెస్ అయ్యాయి. వాటితో అందులో నటించిన భామలకు మంచి గుర్తింపు వచ్చింది. మరి బాలయ్య 109 లో ఐటం భామ ఎవరవుతుందో చూడాలి. అతి త్వరలోనే ఆ విషయం తెలిసే అవకాశం ఉంది. ఇప్పటికే కొద్ది భాగం షూటింగ్ పూర్తయింది. ప్రస్తుతం ఏపీలో ఎన్నికల నేపథ్యంలో షూటింగ్ కి బ్రేక్ పడింది. గెటప్ కోసం చియాన్ కష్టం బాలయ్య ఎన్నికల ప్రచారంలో ఉ ండటంతో పాటు, బయట తీవ్రమైన ఎండలు వీస్తుండటంతో ఎలాంటి షూటింగ్ చేయలేదు. మళ్లీ జూన్ లో బాలయ్య తిరిగొచ్చిన తర్వాత సెట్స్ కి వెళ్లే అవకాశం ఉంది. ఈ సినిమా తర్వాత బాబి మరోసారి సీనియర్ హీరోనే డైరెక్ట్ చేసే అవకాశం ఉందని వినిపిస్తుంది. ఈ లిస్ట్ లో నాగార్జున..వెంకటేష్ పేర్లు వినిపిస్తున్నాయి. ఇంతవరకూ నాగార్జునతో బాబి సినిమా చేయని సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ముందుగా ఆయనతోనే ముందుకెళ్లే అవకాశం ఉంది.


## రాబిన్ హుడ్ వేటకు డేట్ సెట్టయ్యింది!

యువ హీరో నితిన్ ఈసారి ఎలాగైనా రాబిన్ హుడ్ సినిమాతో బాక్సాఫీస్ వద్ద మంచి సక్సెస్ అందుకోవాలని సిద్ధమవుతున్నాడు. తనకు ఇదివరకే మంచి సక్సెస్ అందించిన దర్శకుడు వెంకీ కుడుముల ఈసారి సరికొత్త స్టైల్ తో నితిన్ చూపించబోతున్నట్లుగా అర్థమవుతుంది. వీరి కాంబినేషన్ లో ఇంతకుముందు వచ్చిన భీష్మ సినిమా ఎలాంటి విజయాన్ని అందుకుందో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. అయితే ఈసారి దర్శకుడు కమర్షియల్ ఎలిమెంట్స్ లోనే మంచి హై వోల్టేజ్ యాక్షన్ సన్నివేశాలను కూడా చూపించబోతున్నట్లుగా తెలుస్తోంది. రాబిన్ హుడ్ సినిమాలో నితిన్ లుక్కుతోనే మెస్మరైజ్ చేస్తున్నాడు. గతంలో ఎప్పుడూ లేనంత హై స్టైలిష్ యాక్షన్ తో కనిపించబొతున్నట్లు అర్థమవుతుంది. ఇక ఈ సినిమా ఎప్పుడు విడుదలవుతుంది అనే విషయంలో చాలా రకాల గాసిప్స్ వైరల్ గా మారాయి. జై హనుమాన్.. డైరెక్టర్ ప్లాన్ మామూలుగా లేదు అయితే మొత్తానికి విడుదల డేట్ విషయంలో నిర్మాణ సంస్థ మైత్రి మూవీ మేకర్స్ ఒక అఫీషియల్ పోస్టర్ ద్వారా క్లారిటీ ఇచ్చింది. రాబిన్ హుడ్ సినిమాను డిసెంబర్ 20వ తేదీన గ్రాండ్ గా విడుదల చేయబోతున్నట్లుగా తెలియజేశారు. ఇక పోస్టర్ లో కూడా నితిన్ క్యాప్ తో స్టైలిష్ బైక్ పై సీరియస్ గా కూర్చున్న విధానం కూడా ఎంతగానో ఎట్రాక్ట్ చేస్తోంది. ఈ సినిమాలో అతను పవర్ఫుల్ హీరోగా కనిపిస్తాడని సమాచారం. ఇక కథలో ఒక మంచి సందేశం కూడా హైలెట్ కాబోతున్నట్లుగా తెలుస్తోంది. దర్శకుడు వెంకీ కుడుముల ఎలాంటి సినిమా చేసిన కూడా అందులో మంచి ఎంటర్టైన్మెంట్ కూడా ఉండేలా చూసుకుంటాడు. అతని మొదటి సినిమా చలో కామెడీ డ్రామాగా వచ్చి ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఇక నితిన్ తో చేసిన భీష్మలో వ్యవసాయానికి సంబంధించిన అంశంతో పాటు కామెడీ సీన్స్ కూడా హైలెట్ అయ్యాయి. తంగళన్ గెటప్ కోసం చియాన్ కష్టం ఇక ఈసారి రాబిన్ హుడ్ సినిమాలో మరో మంచి కథాంశంను హైలెట్ చేస్తూనే తనదైన శైలిలో ఎంటర్టైన్మెంట్ కూడా ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు సమాచారం. ఇక ఈ సినిమాను మైత్రి మూవీ మేకర్స్ చాలా గ్రాండ్ గా నిర్మిస్తోంది. ఇప్పటికే సగానికి పైగా సినిమా షూటింగ్ పూర్తయింది. రీసెంట్ హీరో నితిన్ పుట్టినరోజు సందర్భంగా విడుదల చేసిన టైటిల్ గ్లింప్స్ కూడా అట్రాక్ట్ చేసింది. ఇక ఈ సినిమాలో రాజేంద్రప్రసాద్ వెన్నెల కిషోర్ లాంటి వారు కూడా ముఖ్యమైన పాత్రలలో కనిపించబోతున్నారు. టాలెంటెడ్ మ్యూజిక్ డైరెక్టర్ జీవీ ప్రకాష్ ఈ సినిమా కోసం వర్క్ చేస్తున్నాడు. ఇప్పటికే కొన్ని ట్యూన్స్ కూడా సిద్ధమైనట్లుగా తెలుస్తోంది. త్వరలోనే మొదటి సాంగ్ విడుదల చేసే అవకాశం ఉంది. మరి రాబిన్ హుడ్ సినిమా బాక్స్ ఆఫీస్ వద్ద నితిన్ కు ఎలాంటి సక్సెస్ ను అందిస్తుందో చూడాలి.




## 1177 కి.మీల గమ్యం.. జర్నీ టు అయోధ్య..

రామాయణ ఇతిహాసం ఆధారంగా ఇప్పటికే అనేక సినిమాలు వచ్చిన విషయం తెలిసిందే. గతే ఏడాది పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ ఆదిపురుష్ మూవీ రామాయణం ఆధారంగా తెరకెక్కగా.. బాక్సాఫీస్ వద్ద డిజాస్టర్ గా మిగిలింది. ప్రస్తుతం బాలీవుడ్ లో రామాయణ ప్రాజెక్ట్ తెరకెక్కుతోంది. రణ్ బీర్ కపూర్ రాముడిగా, సాయి పల్లవి సీతగా నటిస్తున్నట్లు ఎప్పటి నుంచో వార్తలు వస్తున్నాయి. ఇంకా దీనిపై అఫీషియల్ అప్డేట్ రాలేదు. ఇప్పుడు టాలీవుడ్ లో రామాయణం ఆధారంగా మరో సినిమా తెరకెక్కుతోంది. శ్రీరామనవమి సందర్భంగా చిత్రాలయం స్టూడియోస్ బ్యానర్ పై నిర్మాత వేణు దోనేపూడి రెండో సినిమాను ప్రకటించారు. జర్నీ టు అయోధ్య వర్కింగ్ టైటిల్ తో సినిమా చేస్తున్నట్లు వెల్లడించారు. ప్రముఖ దర్శకుడు వీఎన్ ఆదిత్య ఈ ప్రాజెక్ట్ కు కథ అందిస్తున్నారు. ప్రస్తుతం ఆదిత్య నేతృత్వంలోనే పలువురు షూటింగ్ కోసం అయోధ్యతో పాటు కొన్ని ప్రదేశాలను పరిశీలిస్తున్నారు. ప్రస్తుతం ఈ క్రేజీ ప్రాజెక్ట్ ప్రీ ప్రొడక్షన్ వర్క్స్ శరవేగంగా జరుగుతున్నాయి. ఈ సినిమాకు ఓ యంగ్ డైరెక్టర్ దర్శకత్వం వహించబోతున్నారు. ఈ ప్రాజెక్ట్ లో ప్రముఖ నటీనటులు, సాంకేతిక నిపుణులు భాగం కానున్నారు. అంతర్జాతీయ సాంకేతిక ప్రమాణాలతో ఈ సినిమాను పాన్ ఇండియా లెవెల్ లో తెరకెక్కించనున్నారు. అందుకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను తమ్మారెడ్డి



భరద్వాజ పర్యవేక్షిస్తున్నారు. మరికొద్ది రోజుల్లో సినిమాకు సంబంధించి అన్ని వివరాలను ప్రకటించనున్నారు మేకర్స్. మూవీ అనౌన్స్మెంట్ సమయంలో పోస్టర్ ను కూడా రిలీజ్ చేశారు. అందులో రాముడు ఒక బ్యాగ్ పట్టుకుని అయోధ్యకు వెళ్తున్నట్లు చూపించారు. ఇంకా 1177 కిలోమీటర్ల గమ్యం ఉన్నట్లు రాసి ఉంది. పోస్టర్ లో చింంఉంంఓంఔ 2025 ట్యాగ్ ను మెన్షన్ చేశారు మేకర్స్. దీని బట్టి చూస్తే.. ఈ సినిమా 2025లో విడుదల అవ్వనున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం సోషల్ మీడియాలో ఈ పోస్టర్ వైరల్ గా మారింది. కంప్లీట్ డీసెంట్ బ్యాక్ గ్రౌండ్ తో ఉన్న అనౌన్స్మెంట్ పోస్టర్.. సినిమాపై మంచి బజ్ క్రియేట్ చేస్తుందని సినీ ప్రియులు కామెంట్లు పెడుతున్నారు. ఆల్ ది బెస్ట్ అంటూ నెటిజన్లు సందడి చేస్తున్నారు. రామాయణ ఇతిహాసం ఆధారంగా అద్భుతంగా తీసి హిట్ కొట్టాలని సూచిస్తున్నారు. అయోధ్య బ్యాక్ డ్రాప్ లో ఈ సినిమా తెరకెక్కనుందని కొందరు నెటిజన్లు అంటున్నారు. మరి ఈ మూవీ షూటింగ్ ఎప్పుడు స్టార్ట్ అవుతుందో చూడాలి.

## ఒత్తిడి మరియు డిప్రెషన్ తగ్గించుకోవడానికి మీరు రెడ్ వైన్ తాగండి..!!

ఈ ఉరుకుల పరుగుల జీవితంలో చాలా మంది విశ్రాంతి లేకుండా పనిచేస్తున్నారు. దాంతో చాలా మంది ఒత్తిడి మరియు ఆందోళను ఎదుర్కొంటున్నారు. ఈ ఒత్తిడి మరియు ఆందోళను తగ్గించడానికి రెడ్ వైన్ ఉత్తమంగా పనిచేస్తుందని పరిశోధకలు అంటున్నారు. అయితే ఇందులో ఉండే ఆల్కహాల్ కంటెంట్ కారణంగా, ఆరోగ్యంపై దాని ప్రతికూల ప్రభావాల వల్ల దీనికి ఎల్లప్పుడూ దూరంగా ఉండాలని సూచిస్తుంటారు. అయితే, వైన్ ప్రేమికులు ఇప్పుడు చాలా సంతోషించాల్సిన విషయం ఒకటి ఉంది. రెడ్ వైన్ తాగడం వల్ల కొన్ని ఆరోగ్య ప్రయోజనాలు లభిస్తాయని కొత్త అధ్యయనం వెల్లడించింది. స్ట్రెస్ మరియు డిప్రెషన్ వంటి మనస్సుకు సంబంధించిన సమస్యలను అరికట్టడంలో రెడ్ వైన్ సహాయపడుతుందని అధ్యయనంలో పరిశోధకులు కనుగొన్నారు. మరియు ఈ రెడ్ వైన్ పానీయంలో ఉన్న రెస్వెరాట్రాల్ మన ఆందోళన మరియు అలసట నుండి ఉపశమనం పొందటానికి ఉద్దేశించబడింది. సమ్మేళనం మెదడులో ఒత్తిడిని కలిగించే ఎంజైమ్‌ను నియంత్రించడం ద్వారా ఒత్తిడి నిరోధక ప్రభావాలను ప్రదర్శిస్తుందని అంటారు.



ఈ అధ్యయనం ఈ అధ్యయనం న్యూరోఫార్మాకోలాగ్ జర్నల్‌లో ప్రచురించబడింది మరియు రెస్‌వెరాట్రాల్ మన నాడీ వ్యవస్థపై సానుకూల ప్రభావాలను చూపుతుందని పరిశోధనలు వెల్లడించాయి. వాస్తవానికి, ద్రాక్షపైన ఉండే తొక్కమరియు విత్తనాలలో కనిపించే ఈ సమ్మేళనం (ద్రాక్షను వైన్ తయారీకి ఉపయోగిస్తారు), అనేక ఇతర ఆరోగ్య ప్రయోజనాలను కూడా అందిస్తుంది. నిరాశ మరియు ఆందోళన రుగ్మతలతో బాధపడుతున్న వారికి అమెరికాలోని బఫెలో విశ్వవిద్యాలయంలోని అసోసియేట్ ప్రొఫెసర్ యింగ్ జు మాట్లాడుతూ, "నిరాశ మరియు ఆందోళన రుగ్మతలతో బాధపడుతున్న రోగులకు చికిత్స చేయడానికి మందులకు రెస్‌వెరాట్రాల్ సమర్థవంతమైన ప్రత్యామ్నాయం." ఇందులో రెస్వెరాట్రాల్ యాంటిడిప్రెసెంట్ లక్షణాలు ఒత్తిడి తగ్గిస్తాయి అయినప్పటికీ, రెస్వెరాట్రాల్ యాంటిడిప్రెసెంట్ లక్షణాలను కలిగి ఉ ందని నిరూపించబడింది, ఫాస్ఫోడీస్టేరేస్ 4 (పిడిఇ 4) పై దాని ప్రభావం ఇప్పటికీ స్థాపించబడలేదు. ఖఆఇ4 అనేది కార్టికోస్టెరాన్ హార్మోన్ చే నియంత్రించబడే ఎంజైమ్. కార్టికోస్టెరాన్ అనేది ఒత్తిడి హార్మోన్, ఇది ఆందోళన మరియు ఒత్తిడికి శరీరం యొక్క ప్రతిస్పందనను ప్రభావితం చేస్తుంది అధిక ఒత్తిడి వల్ల మెదడులో అధిక ఒత్తిడి వల్ల మెదడులో హార్మోన్స్ ఎక్కువగా పెరగడానికి దారితీస్తుంది, ఇది నిరాశ మరియు ఆందోళన ఇతర తీవ్రమైన మానసిక అనారోగ్యాలకు దారితీస్తుంది. ఖఆఇ4 ఎంజైమ్ ఉత్పత్తిని తగ్గించడం ద్వారా కార్టికోస్టెరాన్‌కు వ్యతిరేకంగా రెస్వెరాట్రాల్ న్యూరోప్రొటెక్టివ్ ప్రభావాలను చూపించిందని అధ్యయనం సూచిస్తుంది. యాంటీ-డిప్రెషన్ ఔష యాంటీ-డిప్రెషన్ ఔషధాలలో రెస్వెరాట్రాల్ సమ్మేళనాన్ని చేర్చడంలో పరిశోధన సహాయపడవచ్చు, కాని స్ట్రెస్ మరియు డిప్రెషన్ ఇతర సమస్యలకు చికిత్స చేయడానికి రెడ్ వైన్ తాగవచ్చని నిపుణులు సూచిస్తున్నారు. రెడ్ వైన్‌లో అధికంగా రెస్‌వెరాట్రాల్ ఉన్నప్పటికీ, ఇది తాత్కాలిక ఉపశమనం కలిగించగలదని, ఆల్కహాల్ పానీయం ఆల్కహాల్ వ్యసనం వంటి ఇతర ఆరోగ్య ప్రమాదాలను కూడా కలిగిస్తుందని బృందం పునరుద్ఘాటించింది.

## శ్రేయస్ అయ్యర్‌కు దెబ్బ మీద దెబ్బ! మరో షాక్..




ఓటమి బాధలో ఉన్న కోల్‌కతా నైట్ రైడర్స్ కెప్టెన్ శ్రేయస్ అయ్యర్‌కు మరో షాక్ తగిలింది. నిబంధనలు ఉల్లంఘించిన కారణంగా అతడికి భారత క్రికెట్ నియంత్రణ మండలి భారీ జరిమానా విధించింది. ఇందుకు సంబంధించి ఐపీఎల్ నిర్వాహకులు బుధవారం ప్రకటన విడుదల చేశారు. కాగా ఐపీఎల్-2024లో భాగంగా సొంతమైదానం ఈడెన్ గార్డెన్స్‌లో కేకేఆర్ మంగళవారం రాజస్తాన్ రాయల్స్‌తో తలపడింది. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన అయ్యర్ సేన నిర్ణీత 20 ఓవర్లలో ఆరు వికెట్ల నష్టానికి 223 పరుగుల భారీ స్కోరు సాధించింది. అయితే, లక్ష్య ఛేదనలో ఆఖరి బంతి వరకు పోరాడినా రాజస్తాన్ రాయల్స్ జోస్ బట్లర్ వీరోచిత సెంచరీ కారణంగా ఓటమిని మూటగట్టుకుంది. రెండు వికెట్ల తేడాతో ఓడిపోయి పరాజయం పాలైంది. నిజానికి.. కేకేఆర్ రాజస్తాన్‌ను నిలువరిస్తుందనే అంతా అనుకున్నారు. కొంప ముంచి స్లో ఓవర్ రేటుకానీ స్లో ఓవర్ రేటు కేకేఆర్ కొంపముంచింది. నిర్ణీత సమయంలో బౌలింగ్ కోటా పూర్తి చేయనందున ఆఖరి ఓవర్లో 30 యార్డ్ సర్కిల్ ఆవల కేవలం నలుగురు ఫీల్డర్లనే ఉంచాల్సి వచ్చింది. దీనిని సద్వినియోగం చేసుకున్న బట్లర్ మొదటి బంతికే సిక్సర్ బాదాడు. ఓటమితో పాటు మరో షాక్ కూడాఅనంతరం మూడు బంతుల్లో విజయ సమీకరణం ఐదు పరుగులు కాగా.. చివరి బంతికి సింగిల్ తీసి రాజస్తాన్ విజయలాంఛనం పూర్తి చేశాడు. ఇదిలా ఉంటే.. ఇప్పటికే స్లో ఓవర్ రేటు కారణంగా కేకేఆర్ మ్యాచ్ ఓడిపోగా.. నిర్ణీత సమయంలో బౌలింగ్ పూర్తి చేయనందున కోల్‌కతా సారథి శ్రేయస్ అయ్యర్‌కు బీసీసీఐ రూ. 12 లక్షల జరిమానా విధించింది. ఇది మొదటి తప్పు కాబట్టి ఈ మేర ఫైన్‌తో సరిపెట్టినట్లు తెలిపింది. కాగా ఐపీఎల్-2024లో ఇప్పటి వరకు ఆడిన ఆరు మ్యాచ్‌లలో నాలుగు గెలిచి పాయింట్ల పట్టికలో రెండో స్థానంలో కొనసాగుతోంది.

## రోహిత్‌కు జోడీగా కోహ్లిని ఫిక్స్ చేసిన సెలక్టర్లు!

టీ20 ప్రపంచకప్-2024లో విరాట్ కోహ్లిని భారత ఓపెనర్‌గా చూడబోతున్నామా? అంటే అవుననే సమాధానాలే ఎక్కువగా వినిపిస్తున్నాయి. ఈ రన్‌మెషీన్ కెప్టెన్ రోహిత్ శర్మకు జోడీగా మెగా టోర్నీలో టీమిండియా ఇన్నింగ్స్ ఆరంభిస్తాడనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇందుకు సంబంధించిన ఇప్పటికే రోహిత్ శర్మతో హెడ్‌కోచ్ రాహుల్ ద్రవిడ్, చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్ చర్చలు జరిపినట్లు తెలుస్తోంది. కాగా టీ20 ప్రపంచకప్-2022 తర్వాత రోహిత్‌తో పాటు కోహ్లి కూడా సుదీర్ఘకాలం పాటు పొట్టి ఫార్మాట్‌లో టీమిండియా తరఫున బరిలోకి దిగలేదు. ఈ క్రమంలో ఇటీవల అఫ్గనిస్తాన్‌తో స్వదేశంలో సిరీస్ సందర్భంగా విరాహిత్ ద్వయం పునరాగమనం చేశారు. అయితే, ఆ సిరీస్‌లో కోహ్లి తను రెగ్యులర్‌గా వచ్చే మూడో స్థానంలోనే బ్యాటింగ్ చేశాడు. మరోవైపు.. రోహిత్‌కు జోడీగా యువ సంచలనం యశస్వి జైస్వాల్ ఓపెనింగ్ చేశాడు. ఇదిలా ఉంటే.. యువ ఆటగాళ్లకు పెద్ద పీట వేసే క్రమంలో ప్రపంచకప్-2024లో అసలు కోహ్లికి చోటే దక్కదంటూ గతంలో వార్తలు వచ్చాయి.

# సీతరాముల కల్యాణ మహోత్సవం లలోసునీత మహేందర్ రెడ్డి...



శ్రీ ప్రస్థానం మల్కాజ్గిరి స్టాఫ్ రిపోర్టర్: మల్కాజ్గిరి నియెాజకవర్గం లోని పలు ఆలయాల్లో నిర్వహించిన శ్రీ సీతరాముల కల్యాణ మహోత్సవం కు ముఖ్యఅతిథిగాలుగా మల్కాజ్గిరి పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ఇంచార్జ్ మైనంపల్లిహనుమంతరావుతో కలిసి మల్కాజ్గిరి పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పట్నం సునీతమహేందర్ రెడ్డి హాజరై ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది. సీతారాముల ఆశీస్సులు ఎల్లవేళలా ప్రజలపై ఉండాలని ఆ భగవంతుని కోరుకుంటున్నారు.

## శ్రీరామనవమి సందర్భంగా భారీ బైక్ ర్యాలీ?


### బజరంగ్ దళ్ యువసేన ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ





నర్సాపూర్ (ప్రస్థానం న్యూస్) కౌడిపల్లి మండలం రాజిపేట గ్రామ శివారు పరిధిలోని రామాలయంలో శ్రీరాముని జన్మదినమైన శ్రీరామ నవమి సందర్భంగా రాముల వారి కళ్యాణము గ్రామస్తుల ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా కనుల పండుగగా జరిపించారు. రాజిపేట గ్రామ యువకులు భజరంగ్ దళ్ యువసేన ఆధ్వర్యంలో శ్రీరామ నవమి సందర్భంగా భారీ బైక్ ర్యాలీనీ గ్రామ శివారులోని ఎల్లమ్మ తల్లి ఆలయం నుండి హనుమాన్ ఆలయం వరకు డీజే చెప్పులతో ఆటపాటలతో జైశ్రీరామ్ అంటు నామస్మరణ చేస్తూ ఘనంగా బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బజరంగ్ దళ్ యూత్ సభ్యులు సుంకే నాగరాజు ముదిరాజ్, అరవింద్ గౌడ్, పటేల్ ఉదయ్ కిరణ్, సాయిరాం, సందీప్, వెంకటేష్, సంపత్, రాజు,శ్రీశైలం,శ్రీధర్, మణికంఠ గౌడ్ గ్రామస్తులు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## వేల్పుగొండలో అంగరంగ వైభవంగా సీతారాముల కళ్యాణం హాజరైన మంత్రి దామోదర్ రాజనర్సింహ





టేక్మల్ శ్రీ ప్రస్థానం న్యూస్:-మెదక్ జిల్లా ఆందోల్ నియోజకవర్గం టేక్మాల్ మండలం వేల్పుగొండ గ్రామంలో శ్రీ రామా చలం గుట్టపై సీతారాముల కళ్యాణం బుదవారం శ్రీ శ్రీ శ్రీ పూ"పా" రాజయోగి వెంకట స్వామి ఆధ్వర్యంలో బుదవారం చైత్ర శుద్ధ నవమి రోజునఉదయం వేద బ్రాహ్మణ పండితులచే గణపతి పూజ, గోపూజ, గురుపూజ,అగ్ని ప్రతిష్ట, శ్రీరామ మూలమంత్ర వాహనము ప్రారంభించడం జరిగింది భజన సంకీర్తన, అఖండ శ్రీరామ రామ జపం నిర్వహించరు ఉదయం స్వామివారికి గ్రామంలో పుర వీధుల్లో నుండి రామచలం గుట్టపైకి బోనాలు గండ జ్యోతులు తీయడం జరిగింది అనంతరం సీతారాముల విగ్రహాలను కళ్యాణ వేదికపై స్వాగతించి అంగరంగ వైభవంగా వేద బ్రాహ్మణ పండితులచే సీతారాముల కళ్యాణం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర వైద్యారోగ్య శాఖ సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రి దామోదర్ రాజనర్సింహ ముఖ్య అతిథిగా హాజరయ్యారు మంత్రి దావెూదర్ రాజనర్సింహ స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ పీఠాధిపతులు రాజయోగి వెంకటస్వామిజీ శాలువాతో సత్కరించడం జరిగింది అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు ఇట్టి కల్యాణోత్సవంలో పలు సాంస్కృతిక నృత్యాలు భక్తులను కనువిందు చేశాయి సాయంత్రం సీతారాముల పల్లకి సేవను భజన సంకీర్తనలతో గ్రామంలో పురవీధుల గుండ ఊరేగింపుగా నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమంలో ఆలయ ప్రెసిడెంట్ భాను ప్రకాష్ ఆలయ కమిటీ భక్త బృందం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# మోసపూరిత బిఆర్ఎస్,మతతత్వ బిజెపి పార్టీలకురాష్ట్రంలో స్థానం లేదు హరి వర్ధన్ రెడ్డి...



శ్రీ ప్రస్థానం మల్కాజ్గిరి జిల్లా స్టాఫ్ రిపోర్టర్ : మల్కాజ్ గిరి పార్లమెంటు నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ గెలుపు నల్లేరు పై నడకే పార్లమెంటు ఎన్నికల వార్ రూమ్ ప్రారంభోత్సవంలో మల్కాజ్గిరి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పట్నం సునీత మహేందర్ రెడ్డి× త్వరలో జరగనున్న పార్లమెంటు ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచారం, ఎన్నికల ప్రణాళిక, కార్యకర్తలను, నాయకులను సమన్వయం చేస్తూ పార్టీని గెలుపు పథంలో నడిపేందుకు వార్ రూమ్ ను ఈరోజు మల్కాజ్ గిరి నియోజకవర్గం లోని పార్లమెంటు నియోజకవర్గ ఇంఛార్జ్ మైనంపల్లి హన్మంత రావు క్యాంపు కార్యాలయంలో× ఏర్పాటు చేయడం జరిగింది. ఈ ప్రారంభోత్సవానికి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, టిపిసిసి సీనియర్ అధికార ప్రతినిధి సింగిరెడ్డి హరి వర్ధన్ రెడ్డి పార్లమెంటు అభ్యర్థి శ్రీమతి పట్నం సునీత మహేందర్ రెడ్డి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్,మేడ్చల్, కుత్బుల్లాపూర్, కూకట్ పల్లి, ఉప్పల్ నియోజకవర్గాల ఇంఛార్జ్ లు తోటకూర వజ్రేష్ యాదవ్, కొలన్ హన్మంత రెడ్డి, బండిరమేష్,మందుమలపరమేశ్వర్ రెడ్డి, జిల్లా పరిషత్ చైర్మన్ మలిపెద్ది శరత్ చంద్రారెడ్డి, సమన్వయకర్త బండ్రు శోభారాణి,టిపిసిసి జనరల్ సెక్రటరీలు నర్సారెడ్డి భూపతిరెడ్డి, కందాడి జ్యోత్స్న శివారెడ్డి తో× కలిసి పాల్గొని కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన మీడియా సమావేశంలో హరి వర్ధన్ రెడ్డి మాట్లాడుతూ. పార్లమెంటు ఎన్నికలలో మల్కాజ్ గిరి నియోజకవర్గం లో కాంగ్రెస్ పార్టీ గెలుపు నల్లేరు పై నడకేనని, మోసపూరిత బి ఆర్ ఎస్,మతతత్వ బిజెపి పార్టీలకు రాష్ట్రంలో స్థానం లేదని, అన్ని వర్గాలకు సమన్యాయం చేసే కాంగ్రెస్ పార్టీకే ప్రజలు పట్టం కట్టడానికి సిద్దంగా ఉన్నారని, పట్నం సునీత మహేందర్ రెడ్డి ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని



ప్రజలు నిర్ణయించుకున్నారని, పార్లమెంటు పరిధిలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు 24 గంటలూ పనిచేసే ఈ వార్ రూమ్ ను ఉపయోగించుకుని ఏ సమస్యలున్నా ఈ వార్ రూమ్ కు సమాచారం ఇచ్చిసమన్వయంతో పని చేసి గెలుపుసాధించాలని సూచించారు.

# ఏప్రిల్ 17న ప్రపంచ హిమోఫిలియా దినోత్సవం

### రక్తం గడ్డకట్టక పోవడం కూడా ఓ రకం వ్యాధే దానిపై అవగాహన..చికిత్స కూడా అసవరమే

న్యూఢిల్లీ,ఏప్రిల్17:ఏటా ఏప్రిల్ 17న ప్రపంచ హిమోఫిలియా దినోత్సవ జరుపుకుంటారు. .హిమోఫిలియా వ్యాధి మరియు ఇతర రక్తస్రావ లోపాల గురించి ప్రజల్లో అవగాహన పెంచడం ప్రపంచ హిమోఫిలియా దినోత్సవం. ముఖ్య ఉద్దేశ్యం... ఏప్రిల్ 17 నే ఎందుకు వరల్డ్ ఫెడరేషన్ ఆఫ్ హిమోఫిలియా ను స్థాపించిన ఫ్రాంక్ ష్నాబెల్ ఏప్రిల్ 17 న జన్మించాడు. ఈయన జ్ఞాపకార్థం ఈయన పుట్టినరోజైన ఏప్రిల్ 17 ను ప్రపంచ హిమోఫిలియా దినోత్సవంగా ప్రతి సంవత్సరం నిర్వహిస్తుంది. హిమోఫిలియా అంటే.. మనిషికి గాయం అయినప్పుడు రక్తం కారుతుంది. అయితే, కొంతసేపటి తరువాత రక్తం గడ్డకట్టుతుంది. రక్తం గడ్డకట్టకుండా, రక్తం కారడాన్ని హిమోఫిలియా అంటారు. హిమోఫిలియాను ప్రధానంగా రెండు రకాలుగా విభజించుకోవచ్చు. హిమోఫిలియా ఎ రకంలో ఫ్యాక్టర్ 8 లోపం, బి రకంలో ఫ్యాక్టర్ 9 లోపం కనబడుతుంది. దాదాపు 90శాతం మందిలో ఎ రకమే కనబడుతుంది. మరో 9 శాతం మందిలో బి రకం, మిగతా ఒక శాతం మందిలో ఫ్యాక్టర్ 11, 5 లోపం వంటి ఇతరత్రా రకాల హిమోఫిలియా కనబడుతుంది. 70 శాతం వంశపారంపర్యంగానూ, 30 శాతం ఆకస్మిక జన్యు మార్పిడి కారణంగా, పుట్టుకతో వచ్చే ఈ వ్యాధి వలన వ్యాధిగ్రస్తులు ఏటా పెరుగుతున్నారని సర్వేలు చెబుతున్నాయి. ఎక్కువ శాతం మగపిల్లలోనే ఈ వ్యాధి ఉంటుంది. ప్రతి పదివేల మందిలో ఒకరికి ఈ వ్యాధి ఉంటుంది. వ్యాధిని గుర్తించడం ఎలా.. రక్తం గడ్డకట్టకపోవడం ఈ వ్యాధి ప్రధాన లక్షణం. శరీరంలో గాయాలు అయినప్పుడు, ఏదైనా శస్త్ర చికిత్స జరిగినప్పుడు, ప్రమాదాలు జరిగినపుడు రక్తం గడ్డకట్టకుండా నిరంతరంగా రక్తం స్రవించడం, గాయాలు మానకపోవడం, ముక్కు నుండి రక్తం కారడం, చిగుళ్లు, మల, మూత్రం ద్వారా రక్తం స్రవించడం. సమస్య తీవ్రంగా ఉన్నవారిలో ఇంజెక్షన్ తీసుకున్న చోట పెద్దగా ఉబ్బటం, అక్కడక్కడా చర్మం నల్లగా కమిలినట్టు కనిపించటం వంటివీ వేధిస్తుంటాయి. కొందరికి ఎలాంటి కారణం లేకుండానే ఉన్నట్టుండి ఒంట్లోనూ రక్తస్రావం కావొచ్చు. ఇలా కండరాల్లోకి, కీళ్లలోకి రక్తస్రావం కావటం వల్ల తీవ్రమైన నొప్పి, వాపుతో పిల్లలు విలవిల్లాడిపోతారు. తరచుగా రక్తస్రావమైతే కీళ్లు పెద్దగా ఉబ్బి, ఆకారం మారిపోవచ్చు. ఈ అవకరం శాశ్వతంగానూ ఉండిపోతుంది. కాబట్టి దీనిపై అవగాహన కలిగి ఉండటం అవసరం. గాయం నుంచి స్రవిస్తున్న రక్తం ఎంతకీ గడ్డకట్టకపోతే, ఐసు గడ్డను గాయంపై పూసి, తక్షణమే వైద్యుడిని సంప్రదించాల్సి ఉంటుంది.

# నిజామాబాద్‌లో వేడెక్కిన రాజకీయం

నిజామాబాద్,ఏప్రిల్17: లోక్‌సభ ఎన్నికల నోటిఫికేషన్ ఈ నెల 18న విడుదల కానుండడంతో నిజిమాబాద్ పరిధిలో రాజకీయం వేడెక్కింది. ఎన్నికల తేదీ సమీపిస్తున్న కొద్దీ రాజకీయాలు వేడెక్కుతు న్నాయి. అభ్యర్థులు ప్రత్యర్థులపై ఘాటైన విమర్శలు చేస్తున్నారు. ప్రత్యర్థి పార్టీ విధానాలను ప్రశ్నిస్తూ సవాళ్లు విసురుతున్నారు. ఇందుకు పార్టీ సమావేశాలే కాకుండా విలేకర్ల సమావేశాలు, ప్రసార మాధ్యమాల్లో ఇంటర్వ్యూలను వేదికగా చేసుకుంటున్నారు. సామాజిక మాధ్యమాల్లోనూ ప్రత్యర్థుల వైఫల్యాలు, తమకు అవకాశం ఇస్తే ఏం చేస్తామనే విషయాలు విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. మూడు పార్టీలు వ్యూహాత్మకం గా ప్రచారం సాగిస్తున్నాయి. ప్రధానంగా పార్టీ శ్రేణులను సమాయత్తం చేయటంపైనే దృష్టిసారించాయి. ఇకపై జనంలోకి వెళ్లే విధంగా ప్రచార కార్యాచరణ అమలు చేయనున్నాయి. ఇందుకోసం పార్టీలు పార్లమెంటు నియోజకవర్గంలోని అసెంబ్లీ సెగ్మెంట్లకు సమన్వయ కమిటీలను వేస్తున్నాయి. ఆయా కమిటీలు మండలాల వారీగా ఉన్న కమిటీలతో సమన్వయం చేసుకుంటూ ప్రచార పర్వాన్ని ఉద్ధృతం చేయనున్నట్లు తెలుస్తోంది. నామపత్రాల దాఖలు తర్వాత ప్రచార సామగ్రి మండలాల వారీగా పంపిణీ చేసే విధంగా ప్రణాళికలు సిద్ధం చేశారు. పోటీ చేస్తున్న ముగ్గురు అబ్యర్థులు పోటాపోటీగా ప్రచారంలో దూసుకు పోతున్నారు. బిజెపి నుంచి ప్రస్తుత ఎంపి ధర్మపురి అర్వింద్, కాంగ్రెస్ నుంచి ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, బిఆర్ఎస్ నుంచి బాజిరెడ్డి గోవర్ధన్ పోటీలో ఉన్నారు. నోటిఫజకేసన్ విడుదలతో గురువారం నుంచే నామినేషన్ల దాఖలు పక్రియ ప్రారంభమవుతుంది. నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి మూడు ప్రధాన పార్టీల తరపున బరిలోకి దిగుతున్న అభ్యర్థులు ఇప్పటికే ఓట్ల సమరానికి సన్నద్ధమయ్యారు. నిత్యం పార్టీ శ్రేణులతో సమావేశమవుతూ అస్త్రశస్త్రాలు సిద్ధం చేసుకుంటున్నారు.

### పోటాపోటీగా ముగ్గురు అభ్యర్థుల ప్రచారం 19న నామినేషన్ వేయనున్న అర్వింద్ 22న జీవన్ రెడ్డి నామినేషన్ కార్యక్రమం

భాజపా, భారాస అభ్యర్థులు 19వ తేదీన, కాంగ్రెస్ అభ్యర్థి 22న నామినేషన్ దాఖలు చేసేందుకు నిర్ణయించుకున్నారు. ఇందుకు ఆయా పార్టీల నాయకత్వం ఏర్పాట్లు చేస్తోంది. భాజపా అభ్యర్థి ధర్మపురి అర్వింద్ ఈ నెల 19న పేరు, బలం ఆధారంగా నామినేషన్ దాఖలు చేయాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమం సాదాసీదాగా ఉండనుంది. ఈ నెల 25న మరోమారు ర్యాలీగా వెళ్లి నామపత్రాలు దాఖలు చేసేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఆ రోజు ర్యాలీ, సభ ఉండనుందని సమాచారం. మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ ముఖ్యఅతిథిగా హాజరవుతారని సమాచారం. భారాస అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ కూడా 19వ తేదీనే నామినేషన్ దాఖలు చేయనున్నారు. భారాస నేత, మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు హాజరవుతారని చెబుతున్నారు. 22న కాంగ్రెస్ అభ్యర్థి తాటిపర్తి జీవన్‌రెడ్డి నామినేషన్ వేయనున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు, కాంగ్రెస్ పెద్దలు హాజరవుతారని తెలుస్తోంది. పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో రెండు బహిరంగ సభలు నిర్వహించేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఇందులో ఒకటి అభ్యర్థి నామినేషన్ రోజునే నిజామాబాద్ నగరంలో నిర్వహించాలనే ఆలోచన జిల్లా పార్టీ చేస్తోంది. ఆ రోజు వీలుకాకుంటే సభ తేదీ మారే అవకాశం ఉంది.

# కడియం లక్ష్యంగా బిఆర్ఎస్ నేతల విమర్శలు

### కాంగ్రెస్‌లో చేరడాన్ని తట్టుకోలేక పోతున్న నేతలు

వరంగల్,ఏప్రిల్17:వరంగల్ జిల్లాలో రాజకీయం వేడేక్కింది. నేతల మధ్య మాటల తూటాలు పేలుతున్నాయి. కడియం కాంగ్రెస్‌లో చేరడంతో వీరంతా విమ్శలకు పదను పెడుతున్నారు. గత 15రోజుల వరకూ భాయ్ భాయ్ అంటూ తిరిగిన నేతలు.. ఒక్కసారిగా మెడలో కండువా మారడంతో బద్ద శత్రువులైపోయారు. నిన్నటి వరకూ కలుపుగోలుగా తిరిగిన నేతలు మాటల దాడి చేసుకుంటున్నారు. వరంగల్ ఎంపీ సీటు విషయంలో పార్టీ మారిన కడియం శ్రీహరిపై బీఆర్ఎస్ నేతలు మండిపడుతున్నారు. సిట్టింగ్ ఎంపీ పసునూరి దయాకర్, మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్ జంప్‌కి కారణం కడియం అంటూ ఆరోపించారు. వరంగల్ లోజరిగిన బీఆర్ఎస్ కార్యకర్తల మీటింగ్ లో కడియంపై ఫైర్ అయ్యారు. కడియం శ్రీహరికి డాక్టర్ రాజయ్య సవాల్ విసిరారు. స్టేషన్‌ఘన్‌పూర్‌లో అభివృద్ధిపై చర్చకు సిద్ధమా అంటూ ఛాలెంజ్ చేశారు. త్వరలో కడియం విదేశీ ఆస్తుల వివరాలు బయటపెడతానన్నారు. కడియంపై మాజీ మంత్రి దయాకర్ రావు సెటైర్లు వేశారు. కడియం జీవిత చరిత్ర మొత్తం తన చేతిలో ఉందన్నారు. టైం వచ్చిన రోజు బయటపెడతాన్నారు. కడియం శ్రీహరి వల్ల కాంగ్రెస్‌కి త్వరలో పెనుప్రమాదం పొంచి ఉందంటూ పెద్ది సుదర్శన్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. 2, 3 నెలల్లో స్టేషన్‌ఘన్‌పూర్‌కు ఉప ఎన్నికలు వస్తాయన్నారు. దానంకు నోటీసులు వచ్చాయి. రేపో మాపో కడియంకు కూడా నోటీసులు వస్తాయన్నారు. మరోవైపు ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, రాజయ్యపై మండిపడ్డారు కడియంశ్రీహరి. లిఫ్ట్ ఇరిగేషన్‌లో పల్లా లంచాలు తీసుకుంటే.. దళితబంధులో రాజయ్య లంచాలు తీసుకున్నారని ఆరోపించారు కడియం. వరంగల్ జిల్లాలో బీఆర్ఎస్ వర్సెస్ కడియం అన్నట్లుగా మారింది రాజీయం. కడియం టార్గెట్‌గా బీఆర్ఎస్ నేతలు ప్రచారం మొదలెట్టారు. ఈవిమర్శల దాడి ముందుముందు ఇంకెత వరకూ వెళ్తోందో చూడాలి.

# లోక్ సభ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియకు సంబంధించిన పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు

### నామినేషన్ల ప్రక్రియకు మూడు అంచెల పటిష్ట బందోబస్తు : జిల్లా ఎస్.పి డా.బి.బాలస్వామి ఐ.పి.ఎస్



మెదక్ శ్రీ ప్రస్థానం న్యూస్:-నామినేషన్ల ప్రక్రియ సజావుగా నిర్వహించేందుకు మూడు అంచెలా పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేపట్టామన్నారు. ఈ రోజు జిల్లా ఎస్.పి డా.శ్రీ.బి.బాలస్వామి ఐ.పి.ఎస్ గారు మాట్లాడుతూ...పార్లమెంట్ ఎన్నికల నామినేషన్ సందర్భంగా మాట్లాడుతూ...., లోక్ సభ ఎన్నికలకు నామినేషన్ల ప్రక్రియ ఏప్రిల్ 18 నుంచి ఏప్రిల్ 25 వరకు జరుగుతుందని, ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ల స్వీకరణ ఉంటుందని దానికోసం సెంట్రల్ ఫోర్స్, అర్మడ్ మరియు సివిల్ ఫోర్స్ తో మూడు అంచెల భద్రత ఏర్పాటు చేయడం జరిగింది అని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఎటువంటి శాంతి భద్రతల సమస్యలు, అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా పోలీస్ పరంగా అవసరమైన అన్ని భద్రతా చర్యలు, పటిష్ట బందోబస్త్ ఏర్పాటు చేశామన్నారు. రిటర్నింగ్ అధికారి చాంబర్ నుండి 100 మీటర్ల పరిధిలో ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం బందోబస్తు నిర్వహించడం జరుగుతుంది అని ఈ సందర్భంగా తెలిపారు.

## శ్రీరామచంద్రుని కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే సునీత రెడ్డి



నర్సాపూర్ (ప్రస్థానం న్యూస్)నర్సాపూర్ పట్టణంలోని అంతర్గత సీతారాంపూర్ గ్రామంలో సీతారాముల కల్యాణ మహోత్సవం వేద బ్రాహ్మణుల మధ్య అంగరంగ వైభవంగా జరిగింది. సీతారాముల కల్యాణ మహోత్సవంలో భాగంగా నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని జరుపుకోవడం ఆనందకరమైన విషయంగా భావిస్తూ గ్రామంలోని ప్రజలు ఎల్లవేళలా సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో ప్రశాంతమైన జీవితాన్ని గడపాలని అందుకు ఆ శ్రీరామచంద్రుని ఆశీస్సులు ఎప్పుడూ ఉంటాయని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ అశోక్ గౌడ్ చుట్టుపక్కల గ్రామాల భక్తులు గ్రామ ప్రజలు భారీ ఎత్తున పాల్గొన్నారు.

## వీరోజిపల్లి గ్రామంలో శ్రీరామనవమి సందర్భంగా హనుమాన్ టెంపుల్ లో పూజా కార్యక్రమం మరియు గ్రామంలో బైక్ ర్యాలీ భారీగా నిర్వహించారు......





పెద్ద శంకరంపేట శ్రీ ప్రస్థానం న్యూస్:- వీరోజిపల్లి గ్రామంలో శ్రీరామనవమి సందర్భంగా హనుమాన్ టెంపుల్ లో పూజా కార్యక్రమం మరియు గ్రామంలో బైక్ ర్యాలీ భారీగా నిర్వహించారు గ్రామ పెద్దలు గ్రామ యువకులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు యువకులు బాదనపల్లి శివకుమార్ నక్క నరసింహులు కుమ్మరి దేవయ్య బాబు ఎంబరి రమేష్ ఏంబరి భూమయ్య చింత రమేష్ సిహెచ్ శ్రీకాంత్ శనిగరి రవి మేకల ప్రశాంత్ శనిగరి నరేష్ ఏంబరి కుమార్ నిమ్మల గారి సంగమేశ్వర్ శనిగరి రాజు, గుత్ప శ్రీకాంత్ అనిల్ ఉపేందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY PERUMALLA CHENNAKESHAVULU PRINTED AT UTTEJETHA PRINTERS,H. NO: 46/801BHUDHAWARPETA, KURNOOL DIST,-518001, ANDHRA PRADESH, INDIA . PUBLISHED AT. H.NO 43/217A, NR PETA, KURNOOL DIST, ANDHRA PRADESH, INDIA. EDITOR PERUMALLA CHENNAKESHAVULU RNI NO: APTEL 2020/80757